
ముఖ్యమంత్రిగా 2 లక్షలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుది. జగన్ ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి. టీడీపీ మహానాడులో మహిళా రిజర్వేషన్ల ప్రకటనతో జగన్ మైండ్ బ్లాంక్ అయ్యి మెగా డీఎస్సీలో అక్రమాలంటూ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

సోమవారం 01.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 40 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# ఆరోగ్యాంధ్రకు యోగాంధ్ర బాట

## జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర-2026

- ప్రతిష్టాత్మకంగా జూన్ 21న యోగాంధ్ర@2026
- జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర
- రాజధాని అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి కార్యక్రమం
- వెయ్యి మందితో జిల్లా కేంద్రాల్లో యోగా ఈవెంట్స్
- రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కోటి మంది పాల్గొనేలా కార్యాచరణ
- యోగాంధ్ర 2026 పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా యోగాంధ్ర-2026 నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా డే నిర్వహణకు సంబంధించి మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా యోగాంధ్ర 2026పై తలపెట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. యోగాంధ్ర -2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాజధాని అమరావతిలో 25 వేల మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. రాజధాని ప్రాంతంలోని కృష్ణా నది వంతెనపై యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్ నిర్మాణంలో భాగంగా నదిపై నిర్మించిన బ్రిడ్జిపై కార్యక్రమం ఇంటర్నేషనల్ యోగా డే జూన్ 21న నిర్వహిస్తారు. అలాగే అదే రోజు జిల్లా కేంద్రాల్లో 1000 మందితో నిర్వహించే కార్యక్రమాల్లో

మిగతా 2లో...






# హిస్టరీ రిపీట్..
# ఆర్సీబీ 'డబుల్' ధమాకా!




- గుజరాత్‌పై బెంగళూరు ఘన విజయం..
- ఫైనల్లో గుజరాత్‌పై 5 వికెట్ల తేడాతో బెంగళూరు ఘన విజయం..
- వరుసగా రెండో ఏడాది ఐపీఎల్ ట్రోఫీ కైవసం
- మెరిసిన 'కింగ్' కోహ్లీ, రసిఖ్ సలామ్!



**అహ్మదాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సరికొత్త చరిత్ర సృష్టించింది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ పోరులో గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తద్వారా 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, వరుసగా రెండో ఏడాది ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. ఈ సాలా కప్ నమ్దే' అన్న అభిమానుల కల నిజం చేస్తూ బెంగళూరు జట్టు టోర్నీ విజేతగా నిలిచింది.
లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వెంకటేశ్ అయ్యర్ కేవలం 16 బంతుల్లోనే 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేశాడు. ఆ తర్వాత దేవదత్ పడిక్కల్ (1), కెప్టెన్ రజత్ పటిదార్ (15), కృణాల్ పాండ్యా (1) తక్కువ పరుగులకే అవుట్ అయినా.. ఒకవైపు 'కింగ్' విరాట్ కోహ్లీ తన క్లాస్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

మిగతా 2లో...

# మోదీ చొరవతో కోస్తా రైల్వే జోన్




- ప్రధాని మోదీ సహకారంతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన శకానికి నాంది పలికిన చారిత్రక నిర్ణయం
- డబుల్ ఇంజన్ ప్రభుత్వ కృషితో రైల్వే జోన్ కార్యరూపం
- ప్రధాని మోదీ దూరదృష్టితో సాకారమైన రైల్వే జోన్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

2 లో

# జెన్‌జీ గళమే 'సేనాగళం'




- జెన్‌జీ గళాన్ని వినిపించడమే 'సేనాగళం' లక్ష్యం
- జనసేన సంస్థాగత బలోపేతానికి కొత్త కార్యాచరణ ప్రకటించిన పవన్ కల్యాణ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జనసేన పార్టీని గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడంతో పాటు యువత అభిప్రాయాలు, ఆశయాలకు ప్రాధాన్యం కల్పించేందుకు 'సేనాగళం' పేరుతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా యువత భాగస్వామ్యాన్ని పెంచుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ కమిటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.
ఈ సందర్భంగా సేనాగళం కమిటీలకు మార్గదర్శకాలు విడుదల చేసిన పవన్ కల్యాణ్, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ దేశ సమగ్రతకు భంగం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన గౌరవం ఇవ్వడం, ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపడం, యువతలో సామాజిక బాధ్యత పెంపొందించడం కమిటీల ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని పేర్కొన్నారు. వ్యక్తుల తప్పులను రాజకీయ లేదా సామాజిక వర్గాలపై మోపే ధోరణిని ప్రోత్సహించకూడదని,

మిగతా 2లో...

# గాజువాకలో ఘోరం.. ముగ్గురు బలి



**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖలోని గాజువాక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇవాళ ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా, 9 మందికి గాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులు డ్రైవర్ రాంబాబు (50), గంగులు (70), లెంక ఈశ్వరమ్మగా గుర్తించారు. క్షతగాత్రులను కేజీహెచ్?కి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మిగతా 2లో...

## భూములు ఇచ్చిన రైతులకు
# పరిహారం



- గుంటూరు ఛానల్ విస్తరణకు భూములు ఇచ్చిన 7 గ్రామాల రైతుల ఖాతాల్లో రూ.17.58 కోట్ల జమ
- ఇప్పటివరకు మొత్తం రూ.28.12 కోట్ల పరిహారం చెల్లింపు
- సీఎం చంద్రబాబు సహకారంతో సమస్యల పరిష్కారం: కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ పనుల కోసం భూములు ఇచ్చిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రెండో దఫా పరిహార నిధులను విడుదల చేసింది. ఈ మేరకు ఎనమదల, ప్రత్తిపాడు, గారపాడు, కొండేపాడు, మల్లాయపాలెం, జీజీ పాలెం, రావిపాడు గ్రామాల రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.17.58 కోట్ల పరిహారం జమ అయినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

మిగతా 2లో...


# మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

- అర్హులైన ప్రతి స్వయం సహాయక సంఘ మహిళకు జీవనోపాధి
- జూలై నెలాఖరుకు ప్రతి జిల్లాలో 200 మంది మహిళా పారిశ్రామికవేత్తలుండాలి
- ఉత్తరాంధ్ర జిల్లాల జీవనోపాధి కార్యక్రమ సమీక్షలో మంత్రి కొండపల్లి



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త అన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి విజన్‌కు అనుగుణంగా ప్రతి స్వయం సహాయక సంఘాన్ని ఒక పారిశ్రామిక వేత్త కుటుంబంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మంత్రి పెందుర్తిలోని టిటిడిసి ప్రాంగణంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, డీపీఎంలు, జిల్లా సమాఖ్య సభ్యులతో నిర్వహించిన జీవనోపాధి కార్యక్రమాల సమీక్షలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెర్ప్ తో స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళల ఆర్థిక సాధికారతే తమ లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల మంది సంఘం మహిళలు, 4584 మంది నిపుణులు, 27 వేల మంది వీఓఏలు, 1.5 లక్షల మంది ఈనారీలతో సెర్ప్ చాలా బలంగా ఉందని...

2లో...



# గోదావరి డెల్టాకు జలకళ

- గోదావరి డెల్టాకు ఖరీఫ్ సాగునీటి విడుదల
- రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందస్తు నీటి విడుదల
- బ్యారేజీ మరమ్మతులకు రూ.148 కోట్లు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు: మంత్రి కందుల దుర్గేష్

2 లో

# ఉత్తరాంధ్ర చిరకాల స్వప్నం సాకారం

- దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో అభివృద్ధికి నూతన శకం
- డబుల్ ఇంజన్ సర్కార్' సంకల్పానికి ప్రతీకగా విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రారంభం
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు దూరదృష్టి ఫలితమే ఈ చారిత్రక ఘట్టం
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మంత్రి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నిమ్మాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్ష, మూడు తరాల పోరాటాల ఫలితంగా విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపటి నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించనుండటం చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో సువర్ణ అధ్యాయానికి నాంది పలికే మైలురాయని ఆయన అభివర్ణించారు. దీర్ఘకాలంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు,

మిగతా 2లో...

## ఆరోగ్యాంధ్రకు యోగాంధ్ర బాట



(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని విభాగాల్లో నిర్వహించాలని సీఎం సూచించారు. మొత్తంగా కలిపి కోటి మంది భాగస్వాములు అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 1.50 లక్షల మంది ట్రైనర్లకు అందనంగా మరో లక్ష మందిని ట్రైనర్లుగా చేసేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఒక జిల్లా ఒక థీమ్ తో 14 రోజుల యోగాంధ్ర నిర్వహిస్తారు. జిల్లాల్లో యోగాంధ్ర నిర్వహణకు జిల్లాకు రూ. 25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు.

**అన్ని శాఖల సమన్వయం... కోటి మంది భాగస్వామ్యం :** ఆరోగ్య, మానవవనరులు, మునిసిపల్, పంచాయతీ రాజ్, దేవాదాయ, ఐటీ శాఖల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలోని రెండు ప్రముఖ టూరిస్టు ప్రాంతాల్లో అంటే 56 టూరిస్టు కేంద్రాల్లో ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తారు. ఒక రోజు రెండు జిల్లాల చొప్పున 500 మందితో టూరిస్టు ప్రాంతాల్లో యోగా నిర్వహిస్తారు. అలాగే 14 రోజుల పాటు పార్కులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తారు. యోగాంధ్ర ఈవెంట్స్ కు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవార్డులు చేస్తారు.

**యోగాపై మంతెన సత్యనారాయణ రాజు ప్రత్యేక వీడియోలు :** రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు యోగాంధ్ర నిర్వహణకు సంబంధించి రూపొందించిన పోస్టర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. యోగాపై అవగాహనకు, శిక్షణకు తాను చేపట్టిన కార్యక్రమాలను సత్యనారాయణ రాజు సీఎంకు వివరించారు. 90 ఆసనాల వీడియోలు, 21 ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆసనాలు వీడియోలు, రోజు వారీ సాధన కోసం యోగాసనాలు, ప్రాణాయామంపై 7 వీడియోలు, యోగా సందేహాలు ప్రశ్నలు-సమాధానాలపై చేసిన వీడియోలను పబ్లిక్ డొమైనులో పెట్టనున్నట్లు తెలిపారు. మీడియా, సోషల్ మీడియా, వివిధ డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్ ద్వారా వీటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. 8142404888 నెంబర్ కు హాయ్ అని మెసేజ్ పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఈ వీడియోలను డౌన్ లోడ్ చేసుకోవచ్చని సత్యనారాయణ రాజు వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్ తో పాటు సీఎస్ సాయి ప్రసాద్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీర పాండియన్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మోదీ చొరవతో కోస్తా రైల్వే జోన్



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానుండటం ఉత్తరాంధ్ర చరిత్రలో ఒక విశిష్ట ఘట్టమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రజలు కోరుకున్న రైల్వే జోన్ కల సాకారం కావడం వల్ల ప్రాంత అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని అన్నారు. ఇది కేవలం కొత్త రైల్వే పరిపాలనా విభాగం ఏర్పాటు మాత్రమే కాకుండా, ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, మౌలిక సదుపాయాల పురోగతికి బలమైన పునాది అని ఆయన అభివర్ణించారు.

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో రైల్వే ప్రాజెక్టుల అమలు వేగవంతం కావడంతో పాటు సరకు రవాణా, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని మాధవ్ తెలిపారు. విశాఖపట్నం దేశంలో ప్రముఖ రవాణా, వాణిజ్య కేంద్రంగా మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు విస్తరించేందుకు విశాఖలో ప్రత్యేక రైల్వే నియామక మండలి ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. భవిష్యత్తులో బుల్లెట్ రైలు వంటి ఆధునిక రైల్వే ప్రాజెక్టులకు కూడా ఈ జోన్ దోహదపడే అవకాశం ఉందన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షను నెరవేర్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపిన చొరవ ప్రశంసనీయమన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రస్థానంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని, ఇది ప్రాంతీయ ఆకాంక్షల విజయంతో పాటు సమగ్ర అభివృద్ధికి దారితీసే చారిత్రక నిర్ణయమని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## జెన్‌జీ గళమే 'సేనాగళం'

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి అంశాన్ని వాస్తవాల ఆధారంగా విశ్లేషించే సంస్కృతి పెరగాలని సూచించారు.

సమాజంలో కుల, మత, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టే రాజకీయాలకు యువత దూరంగా ఉండాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఏ వర్గాన్నైనా అదే వర్గం పేరుతో అవమానించే సంస్కృతికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. ప్రగతిశీల ఆలోచనలతో ముందుకు సాగుతూ సామాజిక ఐక్యత, జాతీయ భావన, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు సేనాగళం కమిటీలు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# గోదావరి డెల్టాకు జలకళ



రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్) : గోదావరి డెల్టా రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి కొరత లేకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా సాగునీటిని విడుదల చేసింది. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని గోదావరి జలాలను కాలువలకు విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు ముందస్తుగా నాట్లు వేసుకుని పంటలను రక్షించుకోవాలని సూచించారు. నీటి విడుదలతో పంటలు ముందుగానే చేతికొచ్చి రైతులు నష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుందని అన్నారు.

గత ప్రభుత్వం గోదావరి డెల్టా అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించిన మంత్రి, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల మరమ్మతులకు నిధులు కేటాయించలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం రూ. 148 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించిందని వెల్లడించారు. కాలువల మరమ్మతులకు మరో రూ. 13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.

రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి, 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు చెల్లింపుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ, రైతు బాగుంటే గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందనే దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని అన్నారు. రైతులకు ముందస్తుగా సాగునీరు అందించడం ప్రభుత్వం రైతాంగంపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, బ్యారేజ్ మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ నీటి విడుదలతో కాకినాడ జిల్లా పరిధిలో 1.37 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌లోని 117 గేట్లను కొత్తవిగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సుమారు రూ. 150 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించి రైతులకు మేలు చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి విడుదలకు వార్షిక ప్రణాళిక రూపొందించిన ముఖ్యమంత్రి నిర్ణయాల ఫలితంగానే ధవళేశ్వరం నుంచి ముందస్తుగా నీటి విడుదల సాధ్యమైందన్నారు. గోదావరి ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టిన సర్ ఆర్థర్ కాటన్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, గోదావరి జలాల పరిరక్షణ కోసం పర్యావరణ పరిరక్షణ చర్యలకు ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గోదావరి కాలుష్య నివారణ, బ్యారేజ్ పరిరక్షణ, సాగునీటి సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మూరలశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ, ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి ఈస్టర్న్ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీటిని అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

వెస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణరాజు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే సాగునీటిని విడుదల చేయడం రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర చిరకాల స్వప్నం సాకారం

(మొదటి పేజీ తరువాయి)



సామాజిక సంస్థలు చేసిన నిరంతర ఉద్యమాలకు ఇది విజయ చిహ్నామని మంత్రి తెలిపారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని 'డబుల్ ఇంజన్ సర్కార్' కృషివల్లే ఈ మహత్తర లక్ష్యం సాకారమైందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో రైల్వే జోన్ అంశాన్ని చేర్చేందుకు కృషి చేసిన తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీల పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ :** దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో పరిపాలనా వికేంద్రీకరణకు బలమైన పునాది పడటమే కాకుండా, రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ, కొత్త ప్రాజెక్టుల అమలు, సరకు రవాణా సామర్థ్యాల పెంపు, పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణకు విస్తృత అవకాశాలు ఏర్పడనున్నాయని మంత్రి వివరించారు. విశాఖపట్నాన్ని దేశంలోని ప్రముఖ రవాణా, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే ప్రక్రియలో ఈ జోన్ కీలక పాత్ర పోషించనుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో విశాఖపట్నంలో ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో విశాఖ కేంద్రంగా బుల్లెట్ రైలు ప్రాజెక్టు రూపుదిద్దుకునే అవకాశాలపై కేంద్ర రైల్వే శాఖ చేసిన ప్రకటన ఉత్తరాంధ్ర ప్రజల్లో కొత్త ఆశలను నింపిందన్నారు.

**ఎర్రన్నాయుడు కలకు నేడు రూపం :** దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధన వెనుక దివంగత మహానేత కింజరాపు ఎర్రన్నాయుడు చేసిన పోరాటం చిరస్మరణీయమని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో పలుమార్లు గళమెత్తిన ఎర్రన్నాయుడు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది అత్యవసరమని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. రైల్వే మౌలిక వసతుల విస్తరణ, కొత్త రైళ్ల మంజూరు, ఉపాధి అవకాశాల పెంపు కోసం ఆయన చేసిన కృషి ఉత్తరాంధ్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షను జాతీయ స్థాయిలో ప్రతిధ్వనింపజేసిన ఎర్రన్నాయుడు కల నేడు సాకారం కావడం గర్వకారణమని మంత్రి తెలిపారు.

**తెలుగు ప్రజల తరపున కృతజ్ఞతలు :** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరికను నెరవేర్చి దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు కార్యరూపం దాల్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లకు తెలుగు ప్రజల తరపున మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన యుగానికి నాంది. ఇది ప్రాంతీయ ఆకాంక్షల విజయమే కాకుండా, సమగ్ర అభివృద్ధి దిశగా భారత రైల్వే చరిత్రలో నిలిచిపోయే ఘట్టం" అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)




దీని ద్వారా ఉపాధి కల్పన మరింత విస్తృతం చేస్తామని మంత్రి తెలిపారు. మోడ్రన్ లాండ్రీ యూనిట్లు, హెయిర్ సెలూన్లు, కార్పెంట్రీ, బొటిక్ మేనేజ్‌మెంట్ రంగాల్లో శిక్షణ కోసం పైలెట్ ప్రాజెక్టులు చేపడతామని వెల్లడించారు. సంఘం మహిళలకు సాంకేతిక సాయం, మార్కెట్ సౌకర్యాలు కల్పించడంతో పాటు పీఎం సూర్య ఘర్ యోజన ద్వారా సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పనలో బ్యాంకుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న మంత్రి, అర్హులైన మహిళలకు రుణ సదుపాయాలు కల్పించి, 2026 జూన్ నెలాఖరు నాటికి ఒక్కొక్క జిల్లాలో కనీసం 200 మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సమగ్ర బిజినెస్ ప్లాన్ రూపొందించుకోవాలని, కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పాడి రైతుల కోసం నాణ్యమైన పశుగ్రాసం, సైలేజ్ మేకింగ్ యూనిట్లు మరియు పాలు, పాల ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ ఇస్తామన్నారు. అలాగే పీఎంజెజెబివై, పీఎంఎస్‌బివై పథకాల కింద అర్హులైన మహిళలందరికీ బీమా కల్పించాలని సూచించారు.

**5 లక్షల మంది మహిళా వ్యాపారవేత్తలే లక్ష్యం :** గతంలో డిజిటలైజేషన్ ఇబ్బందులు ఉండేవని... ఇప్పుడు డ్వాక్రా మహిళలకు అందుబాటులో ఉండేలా డిజిటలైజేషన్ తీసుకువచ్చామని.. గ్రామీణ మహిళల పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారని మంత్రి తెలిపారు. త్వరలోనే మన డబ్బులు... మన లెక్కలు అనే ఫోన్ యాప్ డ్వాక్రా మహిళల కోసం తీసుకు వస్తున్నామని.. దీని ద్వారా 85 లక్షల మంది సభ్యులు డ్వాక్రాలో చేసుకున్న అప్పులు, పొదుపు గురించి తెలుసుకోవచ్చన్నారు. అలాగే 5 లక్షల మంది మహిళలను వ్యాపారస్తులుగా చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారని.. అందుకు అనుగుణంగానే మన ప్రణాళికలు ఉండాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా జిల్లాల జిల్లా సమాఖ్య (జిల్లా సమాఖ్య) పాలకవర్గ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. అలాగే గాటోస్ కేఫే, నేటివ్ అరకు కేఫే తదితర జీవనోపాధి భాగస్వామ్య సంస్థల ప్రతినిధులతో కూడా ముఖాముఖి సమావేశమై వారి అనుభవాలు, వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చించారు. అలాగే రాష్ట్రంలోని పీడీ, డీపీఎం, ఏపీఎంలకు 912 ల్యాప్‌ట్యాప్‌లు అందజేసే కార్యక్రమానికి మంత్రి శ్రీకారం చుట్టారు.

సెర్ప్ సీఈఓ కరుణ వాకాటి మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో జీవనోపాధి అవకాశాలను స్థానిక వనరులకు అనుగుణంగా విస్తరించాలని, మహిళలకు రుణాలు, మార్కెటింగ్, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యాపార నిర్వహణలో పూర్తి స్థాయి సహకారం అందించాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో లైవ్లీహుడ్స్ డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్, హెచ్ఆర్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భూములు ఇచ్చిన రైతులకు పరిహారం

(మొదటి పేజీ తరువాయి)



గతంలో విడుదల చేసిన తొలి విడత పరిహారంగా రూ. 10.54 కోట్లతో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ. 28.12 కోట్లను రైతులకు అందించినట్లు ఆయన వెల్లడించారు. గుంటూరు ఛానల్ అభివృద్ధి పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

రైతులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే క్రమంలో రెండో దఫా నిధుల విడుదల కూడా సాధ్యమైందని ఆయన అన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల అమలుతో పాటు రైతుల ప్రయోజనాలను పరిరక్షించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, పరిహార చెల్లింపులను వేగవంతం చేసి న్యాయం జరిగేలా ప్రత్యేక చొరవ చూపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారాన్ని అభినందించారు.

రైతు సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఎనమదల, ప్రత్తిపాడు గ్రామాల రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, అధికార యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గాజువాకలో ఘోరం.. ముగ్గురు బలి

(మొదటి పేజీ తరువాయి)

గాజువాకలో బస్సు ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్?రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు ఆర్టీసీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రమాద కారణాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులకు మండిపల్లి ఆదేశాలిచ్చారు.

గాజువాక బస్సు ప్రమాదంపై ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు మృతిచెందడం బాధాకరమని చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని నారాయణరావు వెల్లడించారు.

## చమురు కంపెనీలకు ఊరట



- **పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్ను తగ్గింపు**
- **జూన్ 1 నుంచి కొత్త రేట్లు అమలు.. దేశీయ ఇంధన ధరల్లో మార్పులేదు**

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ గెయిన్స్ పన్నును తగ్గించింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నోటిఫికేషన్ ప్రకారం జూన్ 1 నుంచి పెట్రోల్ ఎగుమతులపై లీటరుకు రూ. 1.50, డీజిల్ ఎగుమతులపై లీటరుకు రూ. 13.50, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై లీటరుకు రూ. 9.50 ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం అమలులోకి రానుంది. అంతర్జాతీయ ముడి చమురు ధరల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ రేట్లను ప్రభుత్వం పక్షం రోజులకోసారి సమీక్షిస్తోంది.

అయితే దేశీయ మార్కెట్లో విక్రయించే పెట్రోల్, డీజిల్‌పై ప్రస్తుతం అమలులో ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పులు చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధిస్తున్న రోడ్డు మరియు మౌలిక సదుపాయాల సెస్‌ను పూర్తిగా రద్దు చేస్తూ సున్నాకు తగ్గించింది. దీంతో ఎగుమతిదారులపై పన్ను భారం కొంత మేర తగ్గనుంది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు అనూహ్యంగా పెరిగినప్పుడు ఎగుమతిదారులు పొందే అదనపు లాభాలపై నియంత్రణ విధించడంతో పాటు దేశీయ మార్కెట్లో ఇంధన లభ్యతను నిర్ధారించేందుకు కేంద్రం విండ్‌ఫాల్ పన్ను విధానాన్ని అమలు చేస్తోంది. గ్లోబల్ మార్కెట్లో చమురు ధరలు కొంత స్థిరంగా మారుతున్న నేపథ్యంలో ఎగుమతులపై పన్ను రేట్లను తగ్గించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# హిస్టరీ రిపీట్.. ఆర్సీబీ 'డబుల్' ధమాకా!

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతాయుతంగా ఆడుతూనే మైదానం నలుమూలలా షాట్లు బాదిన కోహ్లీ.. 42 బంతుల్లోనే 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 56 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆఖర్లో టిమ్ డేవిడ్ (24) మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ సునాయసంగా విజయాన్ని అందుకుంది. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 2 వికెట్లు తీసినప్పటికీ జట్టును గెలిపించలేకపోయాడు. కాగిసో రబడ 3 ఓవర్లలో 44 పరుగులు సమర్పించుకొని భారీగా నిరాశపరిచాడు.

**అంతకుముందు.. ఆర్సీబీ బౌలర్ల దెబ్బకు గుజరాత్ కల్లాస్**

ఐపీఎల్ ఉత్కంఠ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు అద్భుత ప్రదర్శన చేశారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ జట్టును నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులకే కట్టడి చేశారు. ఆర్సీబీ బౌలర్లు కట్టుదిట్టమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడంతో గుజరాత్ బ్యాటర్లు ఎవరూ క్రీజులో ఎక్కువసేపు నిలదొక్కుకోలేకపోయారు. టాప్ ఆర్డర్ చేతులెత్తేసిన వేళ గుజరాత్ టైటాన్స్ జట్టును వాషింగ్టన్ సుందర్ ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. బాధ్యతాయుతంగా ఆడిన సుందర్ 50 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. మిగతా బ్యాటర్లలో నిశాంత్ సింధు (20), జోస్ బట్లర్ (19), అర్షద్ ఖాన్ (15) పర్వాలేదనిపించినా.. భారీ స్కోర్లు చేయలేకపోయారు. స్టార్ బ్యాటర్లు సాయి సుదర్శన్ (12), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (10) తీవ్రంగా నిరాశపరిచారు.




ఆఖర్లో రాహుల్ తెవాటియా (7), జేసన్ హోల్డర్ (7) వేగంగా పరుగులు రాబట్టడంలో విఫలమయ్యారు. ఆర్సీబీ బౌలర్లలో యువ బౌలర్ రసిఖ్ సలామ్ దార్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు పడగొట్టాడు. అతనికి తోడుగా సీనియర్ బౌలర్లు జోష్ హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ చెరో 2 వికెట్లతో రాణించగా, కృణాల్ పాండ్యా ఒక వికెట్ తీశాడు.

**పండుగ వాతావరణంలో బెంగళూరు..**

మ్యాచ్ ముగియగానే ఆర్సీబీ ఆటగాళ్లు మైదానంలో భావోద్వేగానికి గురయ్యారు. విరాట్ కోహ్లీ, రజత్ పటీదార్ మరియు జట్టు సభ్యులు ఒకరినొకరు కౌగిలించుకొని ఆనందాన్ని పంచుకున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత ఆర్సీబీ ఐపీఎల్ ట్రోఫీని గెలవడంతో అటు బెంగళూరు నగరంతో పాటు సోషల్ మీడియా వ్యాప్తంగా అభిమానుల సంబరాలు అంబరాన్ని తాకాయి.

## నేటి నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ జూన్ ఒకటి నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించనుందని, ఇది రాష్ట్ర చరిత్రలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. దశాబ్దాలుగా రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న కల నెరవేరుతోందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆదివారం వెల్లడించారు. కొత్త రైల్వేజోన్ ద్వారా ఉత్తరాంధ్ర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కొత్త దారులు తెరుచుకుంటాయని అన్నారు. రాష్ట్రాన్ని దేశంలో ప్రముఖ లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దడంలో ఈ రైల్వే జోన్ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మోదీ, కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం, విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా ఏర్పడుతున్న ఈ రైల్వేజోన్ భారతీయ రైల్వేల 18వ జోన్‌గా అవతరించనుంది. విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లతో పాటు కొత్తగా ఏర్పాటైన విశాఖపట్నం డివిజన్ ఈ జోన్ పరిధిలోకి రానున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి ఇచ్చిన ప్రధాన హామీలలో రైల్వేజోన్ ఒకటిగా ఉండగా, దీని అమలు ఇప్పుడు కార్యరూపం దాల్చడం రాష్ట్రాభివృద్ధికి కీలక అడుగుగా భావిస్తున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**నేడు తుని నియోజకవర్గంలో సిఎం పర్యటన**

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని చామవరం గ్రామంలో నిర్వహించే 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొంటారు. షెడ్యూల్ ప్రకారం, ముఖ్యమంత్రి ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 10:50 గంటలకు చామవరం చేరుకుంటారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు లబ్ధిదారులకు సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2:40 గంటలకు తుని నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సాయంత్రం 5:15 గంటలకు అమరావతికి చేరుకోనున్నారు.

## గాజువాక బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా




**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** గాజువాకలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన బాధితులను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం ఆసుపత్రిలో పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు ప్రకటించారు.

మంత్రి వెంట శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అభిషేక్ తదితర అధికారులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటాయని మంత్రి భరోసా ఇచ్చారు.

## 7 కి.మీ. సైకిల్‌పై వెళ్లి.. వ్యవసాయ పనుల్లో మంత్రి నిమ్మల



**పాలకొల్లు(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు తన బిజీ షెడ్యూల్ నుంచి చిన్న విరామం తీసుకున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆయన రైతుగా మారిపోయారు. పాలకొల్లులోని తన నివాసం నుంచి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన స్వగ్రామం అగర్తిపాలేనికి ఆయన సాధారణ వ్యక్తిలా సైకిల్‌పై వెళ్లారు. ఈ ప్రయాణంలో దారిపొడవునా స్థానిక ప్రజలను పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

స్వగ్రామం చేరుకున్న అనంతరం మంత్రి రామానాయుడు నేరుగా తన సొంత రొయ్యల చెరువుల వద్దకు వెళ్లారు. అక్కడ స్వయంగా రొయ్యలకు మేత వేసి, వాటి ఎదుగుదలను నిశితంగా పరిశీలించారు. ఆ తర్వాత పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి దిగి, అక్కడ పనులు చేస్తున్న కూలీలతో ముచ్చటించారు. వారితో కలిసి ఉత్సాహంగా ట్రాక్టర్‌పై కూర్చుని దుక్కిదున్నారు. మంత్రి పదవిలో ఉన్నప్పటికీ, మట్టి వాసనను మరువకుండా సాధారణ రైతులా ఆయన శ్రమించిన తీరు స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది. గోదావరి డెల్టాలకు సాగునీరు విడుదలయిన నేపథ్యంలో సాగునీటి శాఖ మంత్రి స్వయంగా ఇలా పొలం పనుల్లో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. తనకు ఎంతో ఇష్టమైన వ్యవసాయ పనుల్లో గడపడం ద్వారా రైతు కష్టాన్ని, వారి అవసరాలను మరోసారి క్షేత్రస్థాయిలో అర్థం చేసుకునేందుకే ఈ రోజంతా కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు.

## రేపటి నుంచి మంత్రి లోకేష్ రష్యా పర్యటన

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంగళవారం నుంచి రష్యాలో పర్యటించనున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ పర్యటన సాగనుంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్ (ఎస్‌పిఐఇఎఫ్) సదస్సులో పాల్గొనాలని మంత్రి లోకేష్‌కు ఆహ్వానం అందింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా.. మంత్రి లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

# అభివృద్ధిలో మచిలీపట్నం అగ్ర పదంలో నడిపిస్తా

- **పర్యాటకం, యువత, క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత**
- **రోజంతా నియోజకవర్గంలో బిజీ బిజీగా మంత్రి కొల్లు రవీంద్ర**



**మచిలీపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** మచిలీపట్నాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపి తీరుతానని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారు. ఉదయం మంగినపూడి బీచ్ లో అభివృద్ధి పనులను పరిశీలించారు. మచిలీపట్నాని పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా బీచ్‌ను సుందరీకరించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన వివరించారు.

బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పారిశుధ్యం, రహదారులు, తాగునీరు, లైటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా మచిలీపట్నం బీచ్ రోడ్డులో కూలిపోయిన చెట్లను స్వయంగా తొలగించారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.

అనంతరం మచిలీపట్నం 4వ డివిజన్‌లోని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంగణాన్ని పరిశీలించారు. యువతలో నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించే దిశగా రానున్న రోజుల్లో ఏర్పాటు చేయనున్న యూత్ క్లబ్బై రిటైర్డ్ డీవైఈఓ అధికారి విజయలక్ష్మి, కృష్ణాజిల్లా భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ మద్దూరి ప్రసాద్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు.

యువతను క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల వైపు ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా యువతలో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు.

అదేవిధంగా మచిలీపట్నం 4వ డివిజన్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించారు. యువత మరియు క్రీడాకారులకు మెరుగైన శిక్షణా సౌకర్యాలు అందించేందుకు అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

మచిలీపట్నం సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, పర్యాటకం, యువత, క్రీడా రంగాల అభివృద్ధి ద్వారా నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## గాజువాక బస్సు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

- **క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై అధికారులతో సమీక్షించిన మంత్రి సత్య కుమార్ యాదవ్**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** గాజువాకలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదివారం విశాఖపట్నం జిల్లా అధికారులు, వైద్యాధికారులతో టెలిఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరాలు తెలియజేస్తూ, ప్రమాదంలో గాయపడిన మొత్తం తొమ్మిది మందిలో ఎనిమిది మందికి విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో చికిత్స అందిస్తున్నామని, మరో వ్యక్తి ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారని తెలిపారు. క్షతగాత్రుల్లో ఒకరు లేదా ఇద్దరికి శస్త్రచికిత్సలు నిర్వహించాల్సిన అవసరం రావచ్చని, ప్రస్తుతం వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ చికిత్స కొనసాగిస్తున్నారని అధికారులు వెల్లడించారు. మిగిలిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మంత్రికి వివరించారు.

క్షతగాత్రులందరికీ అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. బాధితులు, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలిచి అవసరమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

అలాగే క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్‌ను మంత్రి ఆదేశించారు.

ఈ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయిన అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు అధికారులు మంత్రికి తెలియజేశారు.

## జగన్ మళ్ళీ సీఎం కావడమే ఏకైక లక్ష్యం

- **ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి సూచించారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడమే పార్టీ శ్రేణుల ఏకైక లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం ఆదివారం సందడిగా మారింది. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కార్యాలయానికి రావడంతో ఆయనను కలవడానికి అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్యాంపు కార్యాలయం మొత్తం కోలాహలంగా మారింది.

ఈ సందర్భంగా వైసీపీ వాలంటీర్ విభాగం పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడుగా నియమితులైన షేక్ ఆజాద్ (మున్నా) ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. లేళ్ళ అప్పిరెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, కష్టపడి పని చేసే వారికి పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అందరూ కలిసికట్టుగా పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలనకు నిరసనగా పార్టీ పిలుపు మేరకు జరిగే అన్ని కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. అంతిమంగా వైఎస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యే కీలక ఘట్టంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బందా రవీంద్రనాథ్, బత్తుల దేవానంద్, మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ, షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, అచ్చాల వెంకటరెడ్డి, మారుతీ కోటి లింగారెడ్డి, పానుగంటి చైతన్య, రత్నప్రసాద్, రబ్బానీ, సురసాని వెంకటరెడ్డి, సుందరరావు, చింతపల్లి రమణ, విప్పర్ల కోటేశ్వరరావు, రెడ్డి కోటేశ్వరరావు, సతీష్, భాగ్యారావు, పండ్ల నారాయణ, నీలి, నిమ్మగడ్డ, ఆటో శ్రీను, సింగు నరసింహారావు, సోమి కమల్, నాగరాజు, శంకర్, సుబ్బరాజు, చిన్న, నవీన్, రమేష్, వెంకాయమ్మ, సత్యవతి, లక్ష్మి, విజయమాధవి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు వర్తించవు

- **కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టడం సరి కాదు**
- **బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసే దేవానంద్**




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** హైందవ ధర్మాన్ని విడిచిపెట్టి ఇతర మతాలను స్వీకరించిన వారికి షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) రిజర్వేషన్లు వర్తించవని, దళిత క్రైస్తవులకు ప్రస్తుతం రాజ్యాంగబద్ధంగా ఎస్సీ హోదా లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసే దేవానంద్ పేర్కొన్నారు. ఈ అంశంపై దేశంలోని న్యాయస్థానాలు పలుమార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయని తెలిపారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ కొందరు రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆయన విమర్శించారు. కోర్టుల తీర్పులు, రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రజల్లో ఆశలు కల్పించడం అవివేకమని అన్నారు. ప్రత్యేకించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత క్రైస్తవులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోందని దేవానంద్ ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సున్నితమైన సామాజిక అంశాలను ఉపయోగించుకోవడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు.

చట్టాలు, న్యాయస్థానాల తీర్పులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా, సామాజిక వర్గాల మధ్య అపోహలు, ఉద్రిక్తతలు సృష్టించేలా వ్యవహరించే వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని దేవానంద్ డిమాండ్ చేశారు.

రాజ్యాంగం, న్యాయవ్యవస్థ నిర్దేశించిన పరిమితులలోనే చర్చలు, డిమాండ్లు జరగాలని, సమాజంలో శాంతి, సామరస్యాలను దెబ్బతీసే ప్రయత్నాలను ప్రజలు గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు.

## రూ.50 లక్షలతో సమిశ్రగూడెం చెరువు సుందరీకరణకు శ్రీకారం



**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలు రూరల్ మండలం సమిశ్రగూడెం గ్రామంలోని చెరువును ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సాంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ పనులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించిన "హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్" లక్ష్యానికి అనుగుణంగా చెరువును ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెరువు పరిసరాల్లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట స్థలాలు, ఆర్సీసీ బెంచీలు, పచ్చదనం, ఫెన్సింగ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మాలకోడూరు చెరువు అభివృద్ధికి ఇప్పటికే చర్యలు ప్రారంభించామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని చెరువులను కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ పనులతో స్థానిక ప్రాంతానికి పర్యాటక శోభ పెరగడంతో పాటు చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఇప్పటికే గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టగా, పశు సంపద సంరక్షణ కోసం నిడదవోలు రూరల్ పరిధిలో త్వరలో 'కాటిల్ హాస్టల్' నిర్మించనున్నట్లు వెల్లడించారు. నిడదవోలు నియోజకవర్గ ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి బాధ్యతను తాను పూర్తిగా నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీలో అక్రమాలకు తావులేదు: మంత్రి సవిత



**అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** మెగా డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోలేదని, ఆరోపణలు చేస్తున్న వారు ఆధారాలు చూపాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత సవాల్ విసిరారు. అనంతపురంలో కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని, వైసీపీ నాయకుల పిల్లలు సైతం డీఎస్సీలో అర్హత సాధించి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారని తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీ, డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, సీపీఎస్ రద్దు వంటి హామీలు అమలు కాలేదని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఇప్పటివరకు రెండు లక్షలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని పేర్కొన్నారు. ఇటీవల మహానాడులో మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని చేసిన ప్రకటనకు విశేష స్పందన వస్తోందని, దీనిని జీర్ణించుకోలేక డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు.

అంతకుముందు టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కురుబ సామాజిక వర్గానికి చెందిన 750 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, మెమొంటోలను మంత్రి సవిత అందజేశారు. విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొంటూ విద్యార్థులు లక్ష్యసాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపు

- **ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కృషి ఫలితమే రైల్వే జోన్: మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ జూన్ 1 నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించనున్న నేపథ్యంలో ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన రైల్వే జోన్ కల సాకారం కావడం రాష్ట్ర చరిత్రలో ఒక కీలక ఘట్టమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సానుకూల నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతర కృషి ఫలితంగానే ఈ లక్ష్యం సాధ్యమైందని పేర్కొన్నారు. కొత్త జోన్ ఏర్పాటుతో రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతమవడంతో పాటు కొత్త రైళ్లు, మెరుగైన కనెక్టివిటీ, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ద్వారా రాష్ట్రంలోని రైల్వే ట్రాక్‌ల విస్తరణ, స్టేషన్ల ఆధునీకరణ, పెండింగ్ ప్రాజెక్టుల అమలు మరింత వేగంగా జరుగుతాయని మంత్రి తెలిపారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల రైల్వే అభివృద్ధికి సమాన ప్రాధాన్యం లభిస్తుందని, బడ్జెట్ నిధుల కేటాయింపులో కూడా రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక, వాణిజ్య, లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దడంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కీలక పాత్ర పోషించనుందని మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రశ్నపత్రాల లీకేజీల గురించి జగన్‌కే బాగా తెలుసు: అనగాని

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా డీఎస్పీపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉండగా ఒక్క టీచర్ పోస్ట్ కూడా ఆయన ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మెగా డిఎస్సీని అడ్డుకోవడానికి 32 కేసులు వేసి విఫలమైనా గొడ్డలి పార్టీ ఇంకా కుట్రలు ఆపట్లేదని ఎద్దేవా చేశారు.

# కైండ్స్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ ఆవిర్భావం




**-తబిత ఆశ్రమం పిల్లలకు ఉచిత స్కూల్ కిట్ల పంపిణీ**

**రామ్ మందిర్ ఏరియా, మే 31 (జర్నలిస్ట్ ఫైల్) :** నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని "కైండ్స్ ఇనిషియేటివ్ ఫౌండేషన్" (KINDS Initiative Foundation) ఆధ్వర్యంలో తబిత అనాథ ఆశ్రమంలోని పిల్లలకు ఉచిత స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం ప్రాజెక్ట్ సీడీపీవో అలేఖ్య పటేల్ సంస్థ పోస్టర్‌ను ఆవిష్కరించి, అనంతరం విద్యార్థులకు స్కూల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనాథ పిల్లల విద్యాభివృద్ధి కోసం కైండ్స్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని అన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు .దయానంద్ గాంధీ మాట్లాడుతూ, తబిత ఆశ్రమంలో ఇలాంటి సేవా కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు.నంది మేడారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ, అనాథ మరియు నిరుపేద పిల్లల మధ్య విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప ఆలోచన అని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారి విద్యాభ్యాసానికి తోడ్పడాలనే లక్ష్యంతో సుమారు రూ.10 వేల విలువైన నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు తదితర స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా రంగాల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కైండ్స్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ డైరెక్టర్లు సుంచూరి రాజశేఖర్, మిట్టపల్లి లిటిల్, గుంటి రవికుమార్, గజ్జల ప్రవీణ్, ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్ర నాయక్‌తో పాటు ఆశ్రమంలోని విద్యార్థులు పాల్గొన్నారు.శీర్షిక సూచన:"అనాథ పిల్లల విద్యకు చేయూత.. కైండ్స్ ఫౌండేషన్ నుంచి స్కూల్ కిట్ల పంపిణీ"

# లేబర్ బాండ్ అండ్ ఉమెన్ మెంబర్గా డుమావత్ స్వామి నాయక




**నంద్యాల, (జర్నలిస్ట్ ఫైల్) :** లేబర్ బాండ్ అండ్ చైల్డ్ ఉమేన్ మరియు డిస్టిక్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబెర్ గా ఎన్నికైన డుమావత్ స్వామినాయక్ ని య ం వి ం త ం ల య నా నంద్యాల మండలంలోని అబాండం తాండ కు చెందిన సీనియర్ గిరిజన నాయకుడు డుమావత్ స్వామినాయక్.గిరిజనుల అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడే వ్యక్తి డుమావత్ స్వామి నాయక్ అని పేర్కొన్నారు .గత 30 సంవత్సరాల నుండి తెలుగుదేశం పార్టీని నమ్ముకొని గిరిజనుల అభివృద్ధి కోసం డుమావత్ స్వామి నాయక్ పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు.న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్ గెలుపుకు కీలకపాత్ర పోషించిన డుమావత్ స్వామినాయక్ కీలక పాత్ర పోషించారు. రాయలసీమ గిరిజన సీనియర్ నాయకుడు డుమావత్ స్వామి నాయక్ కు నామినేటెడ్ పదవి ఇవ్వడం హర్షించదగ్గ విషయం. గిరిజనుల అభివృద్ధి కోసం నిరంతరం తాపత్రయపడే వ్యక్తి డుమావత్ స్వామి నాయక్ .స్వామి నాయక్ తండ్రి 30 సంవత్సరాలు మరియు స్వామి నాయక్ గత 30 సంవత్సరాల నుండి తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అలాగే గిరిజన ప్రజల అభివృద్ధి కోసం కృషి చేశారు.కూటమి ప్రభుత్వం గెలుపు కోసం ఎలక్షన్ లో అహర్నిశలు కష్టపడి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించే దానిలో డుమావత్ స్వామి నాయక్ పోషించారు అలాగే న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గెలుపులో కీలక పాత్ర పోషించి, తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం నంద్యాల జిల్లాలోని గిరిజన తండాలకు మరియు గూడాలకు తిరిగి తెలుగుదేశం పార్టీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చిన వ్యక్తి డుమావత్ స్వామి నాయక్ నేడు కూటమి ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి నామినేటేడ్ పదవి ఇచ్చి న్యాయం చేయడం జరిగింది.కూటమి ప్రభుత్వం డుమావత్ స్వామి నాయక్ కి నామినేటెడ్ పదవి ఇచ్చినందుకు ప్రభుత్వానికి రాయలసీమ గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

# మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ




**-నిరుపేదలకు అన్నదానం.. నాయకుల శుభాకాంక్షలు**

**రామ్ మందిర్ ఏరియా, మే 31 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను గోదావరిఖనిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన చౌరస్తాలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి మంత్రి శ్రీధర్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ ధూళికట్ట సతీష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఐటీ రంగ విస్తరణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో మంత్రి శ్రీధర్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంతల రాజేష్ మాట్లాడుతూ, శ్రీధర్ బాబు ప్రజల మనిషిగా ప్రత్యేక గుర్తింపు పొందారని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. ఆయన జన్మదినం సందర్భంగా చేపట్టిన సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, ఐటీ రంగ విస్తరణలో మంత్రి శ్రీధర్ బాబు సేవలు విశేషమని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఆయనకు ఆయురారోగ్యాలు, మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# విత్తన శుద్ధి కేంద్రాలను తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు



**నంద్యాల, మే 31 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు మండలంలోని పలు వరి విత్తన శుద్ధి కేంద్రాలను తనిఖీ చేయడం జరిగింది.ఈ తనిఖీలో భాగంగా విత్తన శుద్ధి కేంద్రాలలో ప్రాసెసింగ్ రిజిస్టర్, డిస్పాచ్ రిజిస్టర్, బ్రీడర్ బిల్లులు, రైతు రషీదులు మరియు విత్తన నిల్వలను పరిశీలించడం జరిగింది. అదే విధంగా విత్తన నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవడానికి 10 వరి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపడం జరిగింది అని తెలియజేశారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అనుమతి పొందిన రకాలను మాత్రమే మార్కెటింగ్ చేసుకోవాలని ప్రాసెస్సింగ్ ప్లాంట్ రిజిస్టర్ , డిస్పాచ్ రిజిస్టర్, బ్రీడర్ మరియు ఫౌండేషన్ సీడ్ రిజిస్టర్ కచ్చితంగా ,సక్రమంగా నిర్వహించాలని, అదేవిధంగా విత్తనాలు ప్రోసెసింగ్ చేసేప్పుడు కల్తీలు లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, అదేవిధంగా ప్యాకింగ్ చేసేప్పుడు కూడా ఒక రకంలో ఇంకో రకం విత్తనాలు కలవకుండా జాగ్రత్త పడాలని, విత్తన బాగ్స్ పై ఆ రకం ప్రమాణాలు అన్ని ఉండేలా చూస్కోవాలని చెప్పడం జరిగింది. ప్రతి నెల స్టాక్ రిపోర్టు తప్పని సరిగా మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా కార్యాలయానికి అందచేయలని చెప్పటం జరిగింది.విత్తన చట్టం 1966 కి అనుగుణంగా అన్ని పాటించి వ్యాపారం చేస్కోవాలని అలా లేనిచో విత్తన చట్టం 1966 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది.

# వీవోఏల సమస్యలు పరిష్కరించాలి




**-14వ రోజుకు చేరిన వివోఏల సమ్మె**

**తాండూర్, మే 31 (జర్నలిస్ట్ ఫైల్) :** వీవోఏల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు తాండూర్ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఐకేపీ వీవోఏ మండల అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేక దఫాలుగా వివిధ రూపాలలో సమస్యలను విన్నవించామని అయినా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వివోఏలకు అనేక హామీలు ఇచ్చిందని ప్రభుత్వం ఏర్పడి 28 నెలలు పూర్తయిన నేటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారం చేయలేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే కనీస వేతనం 26 వేలు నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హులైన వివోఏ లను సీసీలుగా పదోన్నతి కల్పించాలని, హెచ్ఎర్ పాలసీ అమలు చేయాలని, ప్రమాద బీమాతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఏలు స్వరూప, కిరణ్, విష్ణు, సుధ, రాజు, జనార్ధన్, మమత, జ్యోతి, కుమార్, విజయ, భారతి, తదితరులు పాల్గొన్నారు

# మహిళా వారోత్సవాల్లో అవగాహన ర్యాలీ




**తాండూర్, మే 31 (జర్నలిస్ట్ ఫైల్):** మండలంలోని అభ్యుదయ మండల సమాఖ్య పరిధిలో గురువారం మహిళా వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దివ్యాంగ సభ్యులు, ఉత్తమ సీసీలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలు ఉపయోగపడతాయని ఏపీఎం శ్యామల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు గణపతి, జ్యోతి, రాజేశ్వరి, లక్ష్మి, సమాఖ్య సిబ్బంది సాయి క్రిష్ణ, తాను బాయి, వివిధ గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు

# ఉద్యోగానికే ముగింపు.. సేవకు కాదు: సీపీ ఎం. రమేష





**సైబరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజానికి చేసే సేవా భావానికి మాత్రం ముగింపు కాదని సైబరాబాద్ సీపీ ఎం. రమేష్ అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో శనివారం జరిగిన ఆత్మీయ వీడ్కోలు సభలో పదవీ విరమణ పొందిన 12 మంది పోలీసు సిబ్బందిని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, శాలువాలు, పూలమాలలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. రిటైర్ అయిన వారిలో అడిషనల్ డీసీపీ ఎం. ఫజ్లూర్ రెహమాన్, ఎస్ఐలు జి. రామ్‌చందర్, ఎం. నరసింహారెడ్డి, ఏఎస్ఐలు కమల్ గౌరీ సయ్యద్, ఎం.డి. సర్దార్ బేగ్, ఎం. నారాయణ, ఏఆర్ఎస్ఐలు ఎస్. నాగభూషణం, బి. రమేష్, ఎం. సుధాకర్ రెడ్డి, పి. లక్ష్మయ్య, హెడ్ కానిస్టేబుళ్లు పి. హుస్సేన్ పీరా, జనార్ధన్ ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి శాఖకు మంచి పేరు తెచ్చిన సిబ్బంది సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. పదవీ విరమణ తర్వాత ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబంతో ఆనందంగా గడపాలని, తమ విలువైన అనుభవాన్ని యువ సిబ్బంది వృత్తి నైపుణ్యాల పెంపునకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు టి. అన్నపూర్ణ, ముత్యం రెడ్డి, సృజన కర్ణం, సంజీవ్, సీఏఓ వెంకట్ రెడ్డి, పోలీస్ సహకార సంఘం ఇన్‌చార్జ్ జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు

# గాయపడిన మహిళా కార్మికురాలికి రూ.1.75 లక్షల నష్టపరిహారం అందజేత



కూకట్‌పల్లి, మే 31 (జర్నలిస్ట్ ఫైల్) : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ హెచ్‌పీ రోడ్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న గాయత్రి ప్రైవేట్ లిమిటెడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా కార్మికురాలు ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడిన ఘటనలో ఆమెకు రూ. 1.75 లక్షల నష్టపరిహారం అందజేశారు. విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదంలో మహిళా కార్మికురాలి కుడి చేతి రెండు వేళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాదం అనంతరం సంస్థ యాజమాన్యం వైద్య చికిత్స అందించినప్పటికీ, నష్టపరిహారం విషయంలో తగిన చర్యలు తీసుకోలేదని కార్మికులు పేర్కొన్నారు. దీంతో తోటి కార్మికుల సూచన మేరకు బాధితురాలు రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్‌ను కలిసి తన సమస్యను వివరించింది. విషయాన్ని తెలుసుకున్న రవి సింగ్ వెంటనే స్పందించి సంస్థ యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపారు. బాధిత కార్మికురాలికి న్యాయం జరిగేలా కృషి చేసి, నష్టపరిహారంగా రూ. 1,75,000 అందించేలా యాజమాన్యాన్ని ఒప్పించారు. ఈ సందర్భంగా రవి సింగ్ బాధిత మహిళా కార్మికురాలి కుటుంబ సభ్యులకు రూ. 1.75 లక్షల విలువైన చెక్కును అందజేశారు. తమ సమస్యను పరిష్కరించి న్యాయం జరిగేలా కృషి చేసిన రవి సింగ్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.౦

# డిజిపిని కలిసిన శాసనసభ్యులు కూనంనేని




హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర డిజిపిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను కొత్తగూడెంశాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ ఇతర అంశాలపై చర్చించారు. సివి ఆనంద్ పాలనలో పోలీసులు మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించాలని కూనంనేని ఆకాంక్షించారు. కూనంనేని వెంట సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ కె జానిమియా తదితరులు ఉన్నారు.

# ఆడబిడ్డల ముఖంలో ఆనందం...

ప్రతి ఇంటా కళ్యాణ వైభోగం...

-ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

-కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ.




ఇబ్రహీంపట్నం మే 31 (జర్నలిస్ట్ ఫైల్) : మంచాల మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచే గొప్ప కార్యక్రమంగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అభివర్ణించారు. మంచాల మండలానికి చెందిన 53మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఆడబిడ్డల వివాహం కష్టాలతో జరగకుండా, ఆనందోత్సాహాల నడుమ జరగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు.

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి నిధులు

సీఎస్ఆర్ నిధులను ప్రజా సంక్షేమానికి సమర్థవంతంగా వినియోగించాలి

= నిధుల కేటాయింపు పై సంగారెడ్డి జిల్లా అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి దామోదర రాజనర్సింహ



మే 31 (జర్నలిస్ట్ ఫైల్) సంగారెడ్డి ప్రతినిధి:కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా, పారదర్శకంగా వినియోగించి సామాజిక అభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సీఎస్ఆర్ సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాకు ఆయా పరిశ్రమల నుండి సి ఎస్ ఆర్ కింద ఎన్ని నిధులు వచ్చాయి,ఎంత ఖర్చు చేశాం, ఈ సంవత్సరం ప్రతిపాదనలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సంస్థల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతతో కేటాయించాలని సూచించారు. జిల్లాలోని పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. జిల్లాలోని ఆయా అవసరాలను గుర్తించి, కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వాష్ రూమ్స్ , కాంపౌండ్ వాల్స్ , కిచెన్ షెడ్స్, డైనింగ్ హాల్,డార్మెంటరీ , బెడ్స్, అదనపు క్లాస్‌రూమ్‌ల నిర్మాణం, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతగా వినియోగించాలని మంత్రి తెలిపారు. సీఎస్ఆర్ ప్రతిపాదనల అమలు, పురోగతిపై సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ప్రతిపాదిత పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమలు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములై ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. సీఎస్ఆర్ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి వారికి పలు సూచనలు చేసారు. ప్రజా ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# రైతు గుండెల్లో తుమ్మల- మొక్కజొన్న కొనుగోళ్లతో నెరవేరిన నమ్మకం

- వి వెంకటాయపాలెం సొసైటీ పరిధిలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు - రెండున్నర లక్షల బస్తాలను గోదాములకు తరలించిన అధికారులు- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ హామీ అమలు- రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్న కొనుగోలు నగదు- తుమ్మల నాగేశ్వరరావుకు రైతుల ప్రత్యేక కృతజ్ఞతలు- అల్లిపురంలో బాణసంచా, స్వీట్ల పంపిణీతో సంబరాలు



ఖమ్మం, మే 31 (జర్నలిస్ట్ ఫైల్) : మొక్కజొన్న రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసింది. రైతులు పండించిన ధాన్యం నిల్వల్లోనే ఉండిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టింది. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రకటించిన హామీని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ ప్రక్రియలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. అధికార యంత్రాంగాన్ని నిరంతరం అప్రమత్తం చేస్తూ కొనుగోళ్లు సజావుగా జరిగేలా పర్యవేక్షించారు. రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ భరోసా కల్పించారు. దీంతో రైతుల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగింది.

## - రికార్డు స్థాయిలో కొనుగోళ్లు

వి వెంకటాయపాలెం సొసైటీ పరిధిలో సుమారు రెండున్నర లక్షల బస్తాల మొక్కజొన్నను కొనుగోలు చేశారు. ఈ ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు దాదాపు 300 లారీలు, ట్రాక్టర్లను వినియోగించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వేగంగా తరలింపు చేపట్టారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా చూశారు. ఈ చర్యలతో రైతుల్లో సంతృప్తి వ్యక్తమైంది. వ్యవసాయ శాఖ సమన్వయంతో కొనుగోళ్లు విజయవంతంగా పూర్తయ్యాయి.

## - ఖాతాల్లోకి నేరుగా నగదు

కొనుగోలు చేసిన మొక్కజొన్నకు సంబంధించిన చెల్లింపులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకున్నారు. పారదర్శకంగా నిధులు అందే విధంగా వ్యవస్థను అమలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన ప్రతి బస్తాకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర చెల్లించనుంది. దీంతో రైతులకు ఆర్థిక భరోసా లభించనుంది. చెల్లింపుల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నిర్ణయం రైతు కుటుంబాలకు ఊరటనిచ్చింది.

## - అల్లిపురంలో ఆనందోత్సవం

మొక్కజొన్న కొనుగోళ్లు విజయవంతంగా పూర్తికావడంతో అల్లిపురం గ్రామంలో రైతులు సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గ్రామంలో స్వీట్లు పంచుతూ వేడుకలను జరుపుకున్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచిందని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారి సేవలను గుర్తిస్తూ పాలాభిషేకం నిర్వహించారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.

## - తుమ్మలపై రైతుల ప్రశంసల జల్లు

ఈ కార్యక్రమంలో వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, కార్యదర్శి తిరుపతిరావు పాల్గొన్నారు. రైతుల తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రావూరి నాగరాజు, గుండె ఆదినారాయణ, పులిమల్ల నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. మాదినేని సతీష్, పత్తిపాటి శ్రీను, సంక్రాంతి ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దమ్మాలపాటి సైదులు, రావూరి వీరయ్య, రావూరి చిన్నరామయ్య కూడా సంబరాల్లో భాగమయ్యారు. రైతుల సంక్షేమం కోసం తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న కృషి అభినందనీయమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే విధంగా రైతులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.



# పర్యావరణ పరిరక్షణ కు చర్యలు శూన్యమే


- అక్రమంగా మట్టి, గ్రానైట్ తరలింపు పై మైనింగ్ శాఖ మౌనమేల

ఖమ్మం, మే 31 (జర్నలిస్ట్ ఫైల్): పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాల్సిన ఆ మైనింగ్ శాఖ జిల్లా అధికారిగా విధుల్లో చేరిన నాటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా పరిరక్షణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు అనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. పేరుకే నిజాయితీ ఆఫీసర్ చేసే పనులన్నీ అక్రమ పద్ధతులే అని ఆ శాఖ సిబ్బందే చర్చించుకోవడం ఇప్పుడు ఖమ్మం జిల్లాలో హాట్ టాపిక్ గా మారుతోంది. తమ కుటుంబం అంతా ఉద్యోగుల ఫ్యామిలీ అంటునే చేయాల్సిన పనుల్ని చక్కబెట్టే ప్రయత్నం చాటు మాటుగా చేయడం ఆయనకు షరా మామూలే అనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఖమ్మం రూరల్, అర్బన్, వైరా, మధిర, చింతకాని, బోనకల్లు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, కొణిజర్ల, కారేపల్లి, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మట్టి మాఫీయా వ్యాపారులకు వరంగా ఆ వ్యాపారం కలిసి వస్తోంది. ఖమ్మం జిల్లాలో నిత్యం కోట్ల రూపాయల విలువైన మట్టి ని అక్రమంగా తరలిస్తున్న కనీసం అటువైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులది. ఆయా గ్రామలలో అధికార, ప్రతి పక్ష పార్టీలకు చెందిన నాయకులే కూడా గట్టుకొని ఇదే తరహాలోనే కొత్తగా రూపుదిద్దుకుంటున్న మట్టి మాఫియా దాన్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసే నాధుడే కరువయ్యాడు అనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. మధిర పరిధిలో గల మడుపల్లి చెరువు నుండి రాత్రి వేళల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కల్లూరు మండల పరిధిలోని అనేక గ్రామాల్లో మట్టి మాఫీయా వ్యాపారులు రెచ్చిపోయి మట్టిని అక్రమంగా తరలిస్తున్న కనీసం దాడులు చేసిన పాపాన పోలేదు. అక్కడ కూడా మాజీ ప్రజాప్రతినిధులంతా కలిసి అధికార పార్టీ రాష్ట్ర స్థాయిలో ఉన్న నేత కన్ను సన్నలలో మట్టిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తరలింపు చేసి అతి తక్కువ కాలంలోనే కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కూడా బెట్టుకోవడం జరిగింది. అక్కడి వ్యక్తులు లారీలు, టిప్పర్, ట్రాక్టర్ లను పదుల సంఖ్యలో కొనుగోలు చేసి తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుస్తున్నారనే ఆరోపణలు సర్వత వినిపిస్తున్నాయి. ఇదంతా జరుగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కాని విషయం అని చెప్పక తప్పదు. ట్రాక్టర్ల ద్వారా మట్టిని ఆంధ్ర ప్రాంతానికి తరలింపు చేస్తున్న ఏ ఒక్క రోజు కూడా వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు స్పందించక పోవడం శోచనీయం. ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు మట్టి అక్రమంగా రవాణా దారులకు, గ్రామస్తులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న వారి పట్ల స్పందించక పోవడం శోచనీయం. ఇటీవల మడుపల్లి చెరువులో నుంచి ఆంధ్ర ప్రాంతానికికి అడ్డగోలుగా మట్టిని తరలిస్తున్న మట్టి మాఫియా, గత మూడు రోజుల నుంచి గ్రామస్తులు వద్దు అని చెబుతున్నా వినకుండా మట్టిని తరలిస్తున్న ఊర్లో కొంతమంది మనుషులు ఊరిలో రోడ్లకే పర్మిషన్ ఇవ్వని అధికారులు రాత్రి వేళలో ఆంధ్ర ప్రాంతానికి మట్టిని తోలించేందుకు ఎలా పర్మిషన్ ఇచ్చారు. ట్రాక్టర్లను అడ్డుకొని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు. అధికారులు వెంటనే స్పందించి చర్య తీసుకోవాలని కోరుతున్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న మట్టి గ్రానైట్ అక్రమ తరలింపు పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి. ఈ తరలింపు పై సంబంధించిన అధికారులను వివరణ కోరగా కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేసిన పాపాన పోలేదు. జర్నలిస్టలకే స్పందించని అధికారులు మామూలు ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు అనే అనుమానం కలగమానదు. ఇలాంటి అధికారులకు మంత్రులే సమాధానం చెప్పాలి అని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# కారుణ్య హృదయంతో సేవా దృక్పథం అలవర్చుకోవాలి

మరియ తల్లి స్ఫూర్తితో మరియదళం సేవలు అందించాలి

- ముగిసిన అద్భుతాల మేరీ మాత మహోత్సవాలు



ఖమ్మం, కూసుమంచి,మే 31 (జర్నలిస్ట్ ఫైల్) :దైవమాత మరియతల్లి స్ఫూర్తితో కారుణ్య హృదయంతో సేవా దృక్పథం అలవర్చుకోవాలని భక్తులకు ఉమ్మడి జిల్లా ఆర్ సి ఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ పిలుపునిచ్చారు. పాలేరు లో అద్భుతాల మేరీమాత పుణ్యక్షేత్రం మహోత్సవాల ముగింపు వేడుకలలో బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంతోనీ ఆధ్వర్యంలో తొలుత మరియతల్లి తేరుప్రదక్షిణ కన్నుల పండుగగా జరిగింది. కోలాట బృందం, డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాలతో మరియతల్లి స్వరూపంతో పాలేరులో నేత్రపర్వంగా మరియతల్లి తేరుప్రదక్షిణ జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఈ మరియతల్లి తేరుప్రదక్షిణలో పాల్గొని బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంతోనీ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన నిర్వహించిన అనంతరం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ మాట్లాడుతూ మరియతల్లి అందించిన స్ఫూర్తితో భక్తులు సేవలందించాలని కోరారు. పాలేరు పుణ్యక్షేత్రం కేంద్రంగా మరియదళం ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకంగా సేవలు అందించేందుకు ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఏసుప్రభు చూపిన మార్గం అందరికీ అనుసరణీయం అని తెలియజేశారు. క్షమా, సమాధానం, పరోపకార లక్షణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తెలియజేశారు. కారుణ్య హృదయంతో తోటివారిపట్ల ఆత్మీయతతో మెలగాలని కోరారు. పాలేరులో 76 అడుగుల మేరీమాత స్వరూపం ఆసియా ఖండంలోనే ప్రసిద్ధి చెందడం, ఈ పుణ్యక్షేత్రంలో విశ్వాసులకు మరియతల్లి ఎన్నెన్నో అద్భుత క్రియలతో ఆశీర్వాదాలను అందించారని పేర్కొన్నారు. పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంతోనీ మాట్లాడుతూ పాలేరు పుణ్యక్షేత్రం లో ఎన్నెన్నో అద్భుతాలు జరిగాయని ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని భక్తితో ప్రార్థనలు చేసినవారికి మరియతల్లి ఎన్నెన్నో ప్రయోజనాలను అందించారని తెలిపారు. ఇటీవల ఒక మహిళా భక్తురాలికి 21 సంవత్సరాల తర్వాత పండంటి బిడ్డను మరియతల్లి అందించడం అద్భుత ప్రక్రియ అని తెలిపారు. ఇటువంటి అద్భుతాలు ఈ పుణ్యక్షేత్రంలో ప్రతిభక్తునికి సంతృప్తినిచ్చాయని తెలియజేశారు. అనంతరం ఆధ్యాత్మిక , సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఫాదర్ నందిగామ మారియో, బ్రదర్ బాలరాజు, ఫాదర్ కొరివి థామస్ , ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మత గురువులు, సిస్టర్స్ , బ్రదర్స్, విశ్వాసులు పాల్గొన్నారు.



# ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో మార్పు కోసం పౌరుల మండలి డిమాండ్:సీతారాం దూలపాళ



రాజేంద్రనగర్, మే 31 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజాస్వామ్యం ఎన్నికలతో ముగియదు. అధికారంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా రాజకీయ పార్టీల ప్రధాన బాధ్యత ప్రజా ప్రయోజనాలను కాపాడడం మనందరిపై ఉందని మణికొండ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం దూలపాళ హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీల పనితీరును ఎన్నికల మధ్యకాలంలో నిరంతరం సమీక్షించే,అంచనా వేసే సమర్థమైన వ్యవస్థ లేకపోవడం ఒక ప్రధాన లోపం. నేడు దేశవ్యాప్తంగా అవినీతి,పెరుగుతున్న నిరుద్యోగం,అందరికీ అందుబాటులో ఉండే నాణ్యమైన విద్య,వైద్య సేవలను అందించడంలో వైఫల్యం, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత మరియు పారదర్శక ఎన్నికల నిర్వహణలో లోపాలు,ఆర్థికంగా సాధ్యం కాని ఎన్నికల హామీల పెరుగుదల వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని పౌరుల మండలి డిమాండ్ చేస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా,ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా రాజకీయ పార్టీల పనితీరును అంచనా వేసే "రాజకీయ పార్టీల పనితీరు జవాబుదారీతన వ్యవస్థ" ను చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలని కోరుతోంది. ప్రధాన డిమాండ్లు..రాజకీయ పార్టీల పనితీరుపై స్వతంత్ర వార్షిక మూల్యాంకన వ్యవస్థ. ఎన్నికల హామీల అమలుపై ప్రజా నివేదికలు. అవినీతి,నిరుద్యోగం,విద్య,వైద్యం,మౌలిక సదుపాయాలపై పనితీరు ఆధారిత అంచనా. ఉచిత హామీలు మరియు సంక్షేమ పథకాల ఆర్థిక సాధ్యతపై తప్పనిసరి ప్రజా వెల్లడి. స్వేచ్ఛాయుత,నిష్పక్షపాత మరియు పారదర్శక ఎన్నికల వ్యవస్థ బలోపేతం. ఎన్నికైన ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజలకు అందుబాటులో ఉంచడం. అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీ పనితీరుపై కూడా సమాన స్థాయిలో మూల్యాంకనం. ప్రజల తీర్పు ప్రభుత్వంలో ఉన్నప్పుడు పాలనలో విఫలమైనా,ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను సమర్థంగా ప్రస్తావించడంలో విఫలమైనా,అలాంటి రాజకీయ పార్టీలను ప్రజలు ఎన్నికలలో తిరస్కరించాలి. అదే విధంగా,ప్రజా సమస్యలపై స్పందించకుండా,ప్రజల తరఫున పోరాడకుండా,తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యే రాజకీయ నాయకులను కూడా ప్రజలు నిర్దాక్షిణ్యంగా తిరస్కరించాలి. ప్రజా సమస్యలపై సరైన సమయంలో స్పందించి,ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయని రాజకీయ పార్టీలు,నాయకులు ప్రజల మద్దతుకు అర్హులు కారు. ఎన్నికలు కేవలం హామీలు,భావోద్వేగాలు,కులం,మతం,డబ్బు లేదా ప్రచారాల ఆధారంగా కాకుండా పనితీరు,జవాబుదారీతనం మరియు ప్రజాసేవ ఆధారంగా జరగాలి. ముగింపు రాజకీయ అధికారమే లక్ష్యంగా కాకుండా ప్రజా సేవే లక్ష్యంగా ఉండే రాజకీయ సంస్కృతి ఏర్పడాలి. ప్రజల విశ్వాసాన్ని వాగ్దానాలతో కాదు,పనితీరు,జవాబుదారీతనంతో సంపాదించే రాజకీయ వ్యవస్థను నిర్మించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజా సమస్యలపై స్పందించని,ప్రజల కోసం పోరాడని రాజకీయ పార్టీలు మరియు నాయకులను తిరస్కరించడం ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యం బలపడుతుంది. "ప్రజల చేత,ప్రజల కొరకు,ప్రజల పాలన"అనే ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలోపేతం చేయడానికి ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని పౌరుల మండలి స్పష్టం చేస్తోందన్నారు.

# అభివృద్ధిపై బురదజల్లే వారిని పట్టించుకోవద్దు..!

షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" రైతుల నుండి ప్రతి గింజ కొంటామని హామీ. మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై పాలకవర్గ సమీక్షా సమావేశం

రైతు సంక్షేమంపై దృష్టిని సాధించాలని సూచన



షాద్నగర్ నియోజకవర్గం మే 31 (జర్నలిస్ట్ ఫైల్) : ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డుపై తప్పుడు ప్రచారం చేసే వారిని రైతు సంక్షేమాన్ని, అభివృద్ధిని అడ్డుకునీ బురద జల్లే వారిని పట్టించుకోవాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. షాద్ నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి అధ్యక్షతన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ సెక్రటరీ, కమీషన్ ఏజెంట్లతో షాద్ నగర్ మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయానికి వచ్చే రైతుల వద్ద నుండి ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మార్కెట్ మద్దతు ధర కంటే ఎక్కువగా చెల్లించి కొనడం శుభసూచకమని అన్నారు. పాలకవర్గం సూచన అధికారుల కృషి కమిషన్ ఏజెంట్ల చొరవతో ఎలాంటి ఆటంకాలు లేకుండా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తడిసిన ప్రతి గింజను కొన్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మార్కెట్ యార్డులో మౌలిక వసతులపై అభివృద్ధిపై చర్చిస్తూ రైతులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు అనుగుణంగా పరిస్థితులు ఉన్నప్పటికీ కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై బురదజల్లే పని పెట్టుకుంటున్నారని అలాంటి వారిని పట్టించుకోవద్దని తమ పని తాము చేసుకుంటూ వెళ్లిపోవాలని ఈ సందర్భంగా సూచించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే విషయాలను పరిగణలోకి తీసుకొని రాజకీయంగా చేసే విమర్శలను పట్టించుకోకూడదని పాలక కమిటీకి సూచించారు. యాడుకు వచ్చే ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా అధికారులు పాలకవర్గం కమిటీ కమిషన్ ఏజెంట్లు చొరవ చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, డైరెక్టర్ కరుణాకర్ భరత్ లోహోటీ, రవి నాయక్, పి నర్సింలు, కక్కునూరు సందీప్ కుమార్, వెంకట నరసింహారెడ్డి, తాడిశెట్టినవీన్, కమిషన్ ఏజెంట్లు ప్రకాష్ గుప్తా, జగదీశ్వర్ గుప్తా , కొత్త రాజు, సరపు మల్లేష్, సంజీవయ్య, పెంటయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# డేరింగ్ డాషింగ్ స్టార్ కృష్ణ



- గుంటూరు తూర్పులో ఘనంగా కృష్ణ జయంతి వేడుకలు
- పండ్లు పంపిణీ చేసిన అభిమానులు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** సినీ వినీలాకాశంలో సూపర్ స్టార్ కృష్ణ ధ్రువతారగా నిలిచారని, డేరింగ్ డాషింగ్ స్టార్ గా గుర్తింపు పొందారని గుంటూరు జిల్లా కృష్ణ మహేష్ ఫ్యాన్స్ అధ్యక్షులు కోటా శేషగిరి అన్నారు. కృష్ణ మహేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ (మిర్చి యార్డ్ మాజీ డైరెక్టర్) ఆధ్వర్యంలో సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నసీర్ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కృష్ణ మహేష్ ఫ్యాన్స్ అధ్యక్షులు కోటా శేషగిరి మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సాహసాలకూ, ప్రయోగాలకూ కేరాఫ్ అడ్రస్ గా నటశేఖరుడు నిలిచారన్నారు. తెలుగు సినిమా చరిత్రను 'కృష్ణకు ముందు..తర్వాత' అని కచ్చితంగా చెప్పవచ్చని తెలిపారు. మూస ధోరణిని బద్దలు కొడుతూ, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని, విభిన్న జానర్లను టాలీవుడ్‌కు పరిచయం చేసిన ధీశాలి అని కొనియాడారు. తేనెమనసులు చిత్రం ద్వారా తెలుగు ప్రజలకు పరిచయమైన కృష్ణ సుమారు 500పైగా చిత్రాల్లో ప్రేక్షకులను మెప్పించారని తెలిపారు. మొదటి జేమ్స్ బాండ్, ఈస్ట్‌మన్ కలర్, 70ఎం స్కోప్, డీటీఎస్ వంటి వాటిని తెలుగు సినిమాకు తీసుకొచ్చిన కృష్ణ సాహసం అందరికీ ఆదర్శమని చెప్పారు. కేవలం నటనకే పరిమితం కాకుండా 'పద్మాలయ స్టూడియోస్' స్థాపించి, భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించారన్నారు. ఆయన వారసత్వాన్ని ప్రిన్స్ మహేష్ బాబు అద్భుతంగా ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయిస్తూ తండ్రికి తగిన తనయుడిగా మహేష్ పేరు తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ స్టార్ సీనియర్ ఫ్యాన్స్ అధ్యక్షులు షేక్ బాజీ, గుంటూరు జిల్లా కృష్ణ మహేష్ ఫ్యాన్స్ అధ్యక్షులు కోటా శేషగిరి, బస్సు శీను, సురభి, ఏసు, పఠాన్ జమీర్, మాజీ కార్పొరేటర్ ఎలా అశోక్, బాపారావు, బీసీ నాయకులు వంగర ఏడుకొండలు, షేక్ సలీం, ఎర్రం శెట్టి గిరి, రాజేంద్ర, ముచ్చు దేవా, బండ్లమూడి మధు, షేక్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత మాసకళ్యాణానికి లక్ష విరాళం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠంలో నిర్వహించే జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మాసకళ్యాణ మహోత్సవానికి బెంగుళూరుకు చెందిన జి. విజయ్‌కుమార్, ఆయన ధర్మపత్ని జయంతి మరియు కుటుంబ సభ్యులు కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా శాశ్వత మాసకళ్యాణం నిర్వహించేందుకు సంకల్పించారు. ఇందుకోసం వారు రూ. 1,00,116లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి అనుమతి మేరకు మేనేజర్ ఈశ్వరయ్య చారి దాతలను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఆదాని వెంకటనారాయణ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# 'యాంటీ మలేరియా మాసం'గా జూన్ నెల

- మలేరియా నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి
- జీఎంసీ కమిషనర్ కె. మయూర్ అశోక్




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా జూన్ నెలను "యాంటీ మలేరియా మాసం--2026"గా నిర్వహిస్తున్నట్లు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన "మలేరియా నిర్మూలన వైపు -- ఇప్పుడు మనం చేయగలం, తప్పక చేయాలి" అనే థీమ్‌కు అనుగుణంగా నగరాన్ని మలేరియా రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా సహకరించాలని పిలుపునిచ్చారు.

దోమల ఉత్పత్తి స్థలాలను గుర్తించి నిర్మూలించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మలేరియాను పూర్తిగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

యాంటీ మలేరియా మాసం సందర్భంగా జూన్ నెల మొత్తం నగరంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక ఇంటింటి సర్వేలు నిర్వహించి జ్వర కేసులను గుర్తిస్తామని తెలిపారు.

దోమల లార్వా నిర్మూలన కోసం విస్తృత స్థాయిలో యాంటీ లార్వల్ ఆపరేషన్లు చేపట్టడంతో పాటు, దోమల తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో క్రమబద్ధంగా ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

నిల్వ నీటి కుంటలు, బావులు మరియు ఇతర నీటి వనరుల్లో దోమల లార్వా పెరుగుదలను అరికట్టేందుకు గంబూసియా చేపలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఇళ్ల పరిసరాల్లో ఉన్న నీటి నిల్వలు, ఖాళీ డబ్బాలు, పాత టైర్లు, కూలర్లు తదితర దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి పూర్తిగా తొలగించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

ప్రతి శుక్రవారం నగరవ్యాప్తంగా "డ్రై డే" పాటిస్తూ నిల్వ నీటిని తొలగించే కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు మరియు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపడతామని పేర్కొన్నారు.

నగర ప్రజలు తమ ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరికైనా జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కమిషనర్ కె. మయూర్ అశోక్ విజ్ఞప్తి చేశారు.

# ముగిసిన శ్రీ వేంకటెశ్వర స్వామి వారి గానామృత కార్యక్రమం!




**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):** స్థానిక బాలాజీరావుపేట ప్రియాడీలక్స్ ఎదుట, నారాయణ అష్టాక్షరీ క్షేత్రంగా రూపుదిద్దుకోనున్న కోట బద్రీనాథ్ గుప్తా స్థలం నందు, శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి గానామృత కార్యక్రమం 49 శనివారం ఘనంగా ముగిసింది., శ్రీ భూ సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం లక్ష్యంగా, ఏడుకొండల స్వామికి ఏడు శనివారములు, శ్రీ వెంకటేశ్వర గానామృత సేవ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ వేదాంతం శ్రీ విష్ణు భట్టాచార్యులు శ్రీ వెంటేశ్వర గానామృత సేవ నిర్వహణ పట్ల ట్రస్ట్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఆలయ వ్యవస్థ ప్రాధాన్యతను ఆయన వివరించారు. సర్వ ప్రాణులలో నరజన్మ ఉత్తమమైనదని,ప్రతి భక్తుడు శరణాగతితత్వం అలవర్చుకోవాలన్నారు. మనుధర్మం ప్రకారం ధర్మబద్ధమైన సంపాదనలో, రూపాయిలో 16పైసలు ధర్మం చేయాలని చెప్పారు. దైవసన్నిధానంలో పొందే ఆనందానికి అవధులు గాని, రుపం గాని లేవని, ఆ ఆనందం అనుభవం ఇచ్చే అనుభూతి అన్నారు. కల్యాణ వెంకటేశ్వర ఆలయం ద్వారా శ్రీమన్నారాయణుడే ఈ ప్రాంగణంలో కొలువై ఉంటారనే భావన వ్యక్తం చేశారు. ప్రకృతి పురుషులైన లక్ష్మీ నారాయణుల దివ్యానుగ్రహం ఉంటేనే, అన్ని విధాలుగా స్వామి సేవ చేసుకునే భాగ్యం లభిస్తుందని, ఏడుకొండల స్వామి ఆలయ నిర్మాణ సంకల్పంలో అందరి భాగస్వామ్యం ద్వారా త్వరలోనే కార్యరూపం దాల్చనుందని పేర్కొన్నారు. ఆగమ ప్రకారం అన్నీ సక్రమంగాఉన్నాయని, నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం మహా క్షేత్రంగా పరిడవిల్లనుందని అన్నారు. కార్యక్రమంలో త్రీ టౌన్ సి ఐ, ఎస్. సాంబశివరావు ఆత్మీయ అతిథిగా పాల్గొని, స్వామి సేవలో తరించారు. శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్ .వి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఏడుకొండల స్వామికి ఏడు శనివారములు ఘనంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, ఆదివారం స్వామివారికి ఉదయాస్తమ సేవ కార్యక్రమాన్ని ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుప్రభాత సేవ నుండి పవళింపు సేవ వరకు, తిరుమలలో నిర్వహించే తీరుగా స్వామివారికి అర్చనాదికైంకర్యములు ఉంటాయని, భక్తులు యావన్మంది కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమాలను తిలకించి, ట్రస్ట్ లక్ష్యసాధనలో భక్తులు తమ శక్త్యానుసారము సహకరించాలని కోరారు. తొలుత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కి సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ నేతృత్వంలో మహిళలు విశేషపూజలు నిర్వహించి గానామృతాన్ని భక్తిశ్రద్ధలతో ఆలపించారు.

కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మూర్తి వెంకటేశ్వర రావు,మదుపల్లి చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ ,జంజం రామారావు, ట్రస్టు జీవితకాల సేవా సభ్యులుమాజేటివెంకటేష్ ,కట్టమూరి రమణ కుమార్ ,తుమ్మలపెంట శ్రీనివాసులు ,అంబటి శ్రీనివాసరావు, సుగ్గుల మల్లికార్జునరావు, గోలి సోమశేఖర్, సంకీర్తన బృందం సభ్యులు, ట్రస్టు సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ను ప్రాధాన్యతతో చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 1100 ఏర్పాటు చేసి అర్జీల పరిస్థితి తెలుసుకునే ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ దరఖాస్తులను పి.జి.ఆర్.ఎస్ తో పాటు "మీకోసం" వెబ్ సైట్ లో ఆన్ లైన్ లోను సమర్పించవచ్చని తెలిపారు. అర్జీల వివరాలు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ తో పాటు నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

## ఆర్యవైశ్య సంఘాలకు అన్ని విధాల అండగా ఉంటాం



- రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీ మోహన్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆర్యవైశ్య సంఘాలకు అన్ని విధాల అండగా ఉండి, వారి అభివృద్ధికి సహకరిస్తామని రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం వికాస్ నగర్ లో ఇ.వి.వి యువ కళావాహిని, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఇ.వి.వి యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. మురళి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. సేవాతత్పరత కు ప్రతీకలు గా, సమాజ సేవ లో అగ్రగాములు గా ఆర్య వైశ్యులు వెలుగొందాలన్నారు. సమాజ హితం కోసం ఆర్య వైశ్య సంఘాలు మరింత తోడ్పాటు అందించాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కండే రాజేష్ మాట్లాడుతూ.. సమాజాభివృద్ధి కోసం తాము శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు కండే కాంతారావు, నాగేందర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విజయంలో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఇ.వి.వి యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాజకీయంగా తాడిశెట్టి మురళి మరిన్ని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన తాడిశెట్టి మురళీమోహన్ ఘనంగా సత్కరించి, జ్ఞాపిక ను అంద చేసారు. అనంతరం తాడిశెట్టి మురళీమోహన్ చేతుల మీదగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత పుల్లం శెట్టి ఉదయ్ కుమార్, ఆర్యవైశ్య సంఘాల నాయకులు కాంతారావు నాగేందర్, మనోజ్ కుమార్, కిట్టు, అశోక్, కిరణ్, అనిల్, సందీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసం ఆపరేషన్ దండాయన

- మహిళలు, బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నాం
- మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు, నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది
- జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్



**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్ ):** మహిళల భద్రత కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే 'ఆపరేషన్ దండాయన' అని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్పీ "ఆపరేషన్ దండాయన" పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు, నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన "ఆపరేషన్ దండాయన" కార్యక్రమాన్ని బాపట్ల జిల్లాలో పకడ్బందీగా అమలు చేయనున్నట్లు తెలిపారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో పోలీస్ శాఖ జీరో టాలరెన్స్ విధానంతో పనిచేస్తోందన్నారు. అత్యాచారాలు, గృహహింస, పోక్సో కేసులు, మహిళలపై వేధింపులు వంటి నేరాల్లో నిందితులకు వేగంగా శిక్షలు పడేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు.

మహిళల భద్రత కోసం అమలు చేస్తున్న "స్పీడ్ ట్రయల్ మానిటరింగ్" విధానం ద్వారా కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరస్తులపై చట్టపరమైన చర్యలను మరింత కఠినంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలకు సంబంధించిన ప్రతి కేసులో సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసి, 60 రోజుల్లోపు చార్జిషీట్లు దాఖలు చేసి, కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేసి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బాధిత మహిళలకు అవసరమైన కౌన్సెలింగ్, న్యాయ సహాయం అందించడంతో పాటు నేరస్తులు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామన్నారు. వారి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు.

అలాగే పెండింగ్ కేసులను పునఃసమీక్షించి, ప్రాధాన్యత ఆధారంగా విచారణ పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నైబర్‌హుడ్ వాచ్ విధానాన్ని అమలు చేస్తూ, జియోట్యాగింగ్ ఆధారంగా నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నామన్నారు. మహిళలపై నేరాల నివారణలో ప్రజల అవగాహన కీలకమన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రజా వేదికల ద్వారా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని శక్తి బృందాలకు సూచించామన్నారు. ఇటీవల కేసుల్లో వచ్చిన తీర్పులను ప్రజలకు తెలియజేస్తూ, నేరస్తుల్లో చట్టంపై భయం కలిగించే చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు. మహిళలపై నేరాల విషయంలో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ వైఖరి స్పష్టంగా ఉందన్నారు. ఎంతటి ప్రభావశీలులైనా చట్టం ముందు అందరూ సమానమేనన్నారు. ప్రతి బాధితురాలికి న్యాయం జరిగే వరకు చర్యలు కొనసాగుతాయన్నారు. మహిళల భద్రత కోసం చేపట్టిన 'ఆపరేషన్ దండాయన' విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జి. నారాయణ, ఉమెన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సుబ్బారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రేమయ్య, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

## నేరప్రవృత్తికి స్వస్తి పలకండి



- రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి గుంటూరు పోలీసుల కౌన్సిలింగ్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి పోలీసు అధికారులు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలంటే నేరప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో జీవించాలని, కుటుంబ సభ్యులు, సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. యువతను తప్పుదోవ పట్టించే చర్యలకు పాల్పడకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు.

చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నేరాల నివారణతో పాటు సమాజంలో శాంతి, భద్రతలను కాపాడేందుకు ఇలాంటి కౌన్సిలింగ్ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

# బాపట్ల జిల్లాలో కార్డన్ అండ్ సెర్చ్



- ముగ్గురు డీఎస్పీల ఆధ్వర్యంలో 7గురు సీఐలు, 21 మంది ఎస్ఐలు, 186 మంది పోలీస్ సిబ్బందితో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లు
- మూడు ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లలో 55 ద్విచక్ర వాహనాలు, 9 ఆటోలు, 2 కార్లు సీజ్
- గంజాయి, ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలు, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్

**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్ ):** చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసి జిల్లాలోని ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. రేపల్లె, బాపట్ల, చీరాల సబ్ డివిజన్ల పరిధిలోని చుండూరు, మార్టూరు, చీరాల 2 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సంబంధిత డీఎస్పీల ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. చుండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలపాడు గ్రామంలో, మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదిజాంబవ కాలనీలో, చీరాల II టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో రేపల్లె డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు, బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్ ఆధ్వర్యంలో ఏడుగురు సీఐలు, 21 మంది ఎస్ఐలు, 186 మంది పోలీస్ సిబ్బందితో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లలో 55 ద్విచక్ర వాహనాలు, 9 ఆటోలు, 2 కార్లు, అలాగే నాటుసారా తయారీకి ఉపయోగించే పాత్రలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసి ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నామని హెచ్చరించారు. యువత తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, నాటుసారా తయారీ, నిల్వ, రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పదంగా నివసిస్తున్న వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉన్నట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 112కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

**రేపల్లె సబ్ డివిజన్:** రేపల్లె డీఎస్పీ ఏ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చుండూరు సీఐ ఎం. ఆనందరావు, వేమూరు సీఐ పి.వి. ఆంజనేయులు, రేపల్లె రూరల్ సర్కిల్ సీఐ ఆర్. సురేష్‌బాబు, రేపల్లె టౌన్ సిఐ బి.అశోక్ కుమార్ చుండూరు, చెరుకుపల్లి, అడవులదీవి, నిజాంపట్నం, రేపల్లె, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, 96 మంది పోలీస్ సిబ్బందితో ఆలపాడు గ్రామంలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను సీజ్ చేశారు.

**బాపట్ల సబ్ డివిజన్:** బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి ఆధ్వర్యంలో మార్టూరు సీఐ, బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని ఐదుగురు ఎస్ఐలు, 40 మంది పోలీస్ సిబ్బందితో ఆదిజాంబవ కాలనీలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 3 ద్విచక్ర వాహనాలు, 1 ఆటోను సీజ్ చేశారు.

**చీరాల సబ్ డివిజన్:** చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్ ఆధ్వర్యంలో చీరాల II టౌన్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఇంకొల్లు సీఐ రామనాయక్, చీరాల I టౌన్, చీరాల II టౌన్, కారంచేడు, చిన్నగంజాం పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం, 50 మంది పోలీస్ సిబ్బందితో చీరాల II టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, 2 కార్లను, అలాగే నాటుసారా తయారీకి ఉపయోగించే పాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాల ప్రారంభం చారిత్రాత్మకం

- ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారం
- మంత్రి సత్య కుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు సోమవారం నుంచి ప్రారంభం కానుండడం పట్ల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిన శుభ సందర్భమిదని పేర్కొన్నారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర విభజన చట్టం–2014లో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను కార్యరూపంలోకి తీసుకురావడం ఉత్తరాంధ్ర ప్రజల విజయమని అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో ఇప్పటికే విశాఖపట్నం ఐటీ హబ్‌గా ఎదుగుతోందని, ఈ నేపథ్యంలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మరింత మారనున్నాయని తెలిపారు. రైల్వే రంగంలో అభివృద్ధి వేగవంతమవడంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని అన్నారు. విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులకు రైల్వే జోన్ ద్వారా మరింత మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని, దీనివల్ల ప్రాంతీయ అభివృద్ధి కొత్త ఊపును సంతరించుకుంటుందని చెప్పారు. ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైల్వే రంగ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు రూ. 10,135 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించగా, 2013–14లో ఈ కేటాయింపు కేవలం రూ. 886 కోట్లే ఉన్నదని గుర్తు చేశారు.

ఈ భారీ నిధుల కేటాయింపు ద్వారా రాష్ట్ర అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తోందో స్పష్టమవుతోందని అన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కలను సాకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు మంత్రి సత్య కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## గుంటూరు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎన్.వి. సుందరాచారి బాధ్యతల స్వీకరణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. వి. సుందరాచారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. న్యూరాలజీ విభాగాధిపతిగా విశిష్ట సేవలు అందించిన ఆయన ప్రస్తుతం గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ, గుంటూరు మెడికల్ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి అదే కళాశాలకు ప్రిన్సిపల్‌గా, అనుబంధంగా ఉన్న జీజీహెచ్‌కు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా సేవలందించే అవకాశం రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

పేద ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తానని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి ఎలాంటి భయం, సంకోచం లేకుండా స్వచ్ఛందంగా వైద్యం పొందేలా ఆసుపత్రి సేవలను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరగాలని, అన్ని వర్గాల ప్రజలు జీజీహెచ్‌లోనే చికిత్స పొందే పరిస్థితులు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

జీజీహెచ్‌కు ప్రతిరోజూ సుమారు ఐదు వేల మంది రోగులు వివిధ వైద్య సేవల కోసం వస్తున్నారని, వారి అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య సిబ్బంది, మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులో ఉంచిందని తెలిపారు. భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని డాక్టర్ సుందరాచారి స్పష్టం చేశారు.

## 1998, 2008 ఎంటీఎస్ టీచర్లకు వెంటనే రెన్యూవల్ ఆర్డర్లు ఇవ్వాలి

- వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** 1998, 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ టీచర్లకు తక్షణమే రెన్యూవల్ ఆర్డర్లు జారీ చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, మినిమమ్ టైమ్ స్కేల్‌పై పనిచేస్తున్న 1998, 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ టీచర్లు ప్రతి సంవత్సరం 11 నెలల ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తూ వస్తున్నారని తెలిపారు.

ఈ క్రమంలో వారిని ఏప్రిల్ 30, 2026న విధుల నుంచి రిలీవ్ చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అనేక ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థుల బోధనతో పాటు అడ్మిషన్ల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ఈ టీచర్ల సేవలు అత్యంత అవసరమని వారు అభిప్రాయపడ్డారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఒక రోజు విరామంతో 12 నెలల జీతభత్యాలు అందిస్తున్న నేపథ్యంలో, ఇదే విధానాన్ని 1998, 2008 కాంట్రాక్ట్ టీచర్లకు కూడా వర్తింపజేయాలని కోరారు.

ఈ టీచర్ల సేవలను ఏడాది పొడవునా వినియోగించుకోవడం వల్ల ప్రభుత్వానికి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మనుగడకు, విద్యా వ్యవస్థ బలోపేతానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, వారి సేవలను 12 నెలలకు పొడిగిస్తూ రెన్యూవల్ ఆర్డర్లలో తగిన నిబంధనలు చేర్చి, వారి అనుభవాన్ని విద్యారంగ అభివృద్ధికి వినియోగించుకోవాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

# హింసాత్మక ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం : మంత్రి పార్థసారథి

- అక్రమ మైనింగ్, అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలి
- రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత దాడులు తగవు
- సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలి
- దాడి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామానికి చెందిన నక్కనబోయిన సాంబశివరావు యాదవ్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులను అప్రమత్తం చేసి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖకు సూచించినట్లు వెల్లడించారు.

సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి. రాజకీయ నాయకులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎలాంటి హింసాత్మక చర్యలను ప్రోత్సహించరాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విభేదాలు చర్చలు, చట్టబద్ధ మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

సోషల్ మీడియా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి, వాస్తవాలను ప్రజలకు చేరవేయడానికి ఉపయోగపడాలని, వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు, అభండాలు వేయడానికి దానిని వినియోగించడం సమాజానికి హానికరమని మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణంలో గ్రేవల్‌తో పాటు ఇతర ఖనిజ వనరులు కీలకమని, మైనింగ్ కార్యకలాపాలు పూర్తిగా చట్టబద్ధంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

అక్రమ మైనింగ్‌ను అరికట్టడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు.

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పక్కన పెట్టి ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయడం బాధాకరమని పేర్కొన్న మంత్రి. అధికారులను, వ్యాపార వర్గాలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత దాడులు చేయడం, శాంతిభద్రతలకు భంగం కలిగించడం సమంజసం కాదని స్పష్టం చేసిన మంత్రి కొలుసు పార్థసారథి, సమాజ శ్రేయస్సు కోసం అందరూ సంయమనం పాటిస్తూ చట్టాన్ని గౌరవించాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. వేరే వార్డుల్లోని పేషెంట్స్ అభ్యర్థన మేరకు వారిని పరామర్శించిన మంత్రి.

## ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' 134వ ఎపిసోడ్ వీక్షించిన బీజేపీ నాయకులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన "మన్ కీ బాత్" 134వ ఎపిసోడ్‌ను గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెంలోని సీఆర్ నగర్‌లో భారతీయ జనతా పార్టీ నాయకులు, దళిత నాయకులతో కలిసి ఆదివారం వీక్షించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేద్కర్ అధ్యక్షత వహించగా, జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరు సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తూరు సుబ్బారావు మాట్లాడుతూ, ప్రధాని మోదీ ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే "మన్ కీ బాత్" కార్యక్రమం ద్వారా దేశ ప్రజలతో తన ఆలోచనలు, అభిప్రాయాలను పంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడం ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాల్లో జరుగుతున్న విశేషాలు, విజయగాథలు తెలుసుకునే అవకాశం లభిస్తుందని, అలాగే జాతీయ సమైక్యతా భావం, దేశభక్తి మరింత బలపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లను బీజేపీ గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి నులకా యేసురత్నం పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపూడి ఏసుబాబు, జిల్లా కోశాధికారి గోపి, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజమాత అహల్యాబాయి హోల్కర్ జయంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణకు విశేష కృషి చేసిన రాజమాత రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతిని పురస్కరించుకుని గుంటూరు పట్టాభిపురంలోని స్వామి వివేకానంద సర్కిల్ సమీపంలోని శ్రీ శ్రీ శ్రీ ముక్తేశ్వర సహిత శ్రీ సీతారామస్వామి దేవాలయం వద్ద రెండు రోజుల పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ది రౌండ్ టేబుల్ మిత్ర బృందం, 35వ డివిజన్ బీజేపీ ఇన్‌చార్జి అంకరాజు శశాంక్ శర్మ, మాజీ జిల్లా కార్యదర్శి అంకరాజు నరసింహమూర్తి ఆధ్వర్యంలో సుమారు 500 లీటర్ల మజ్జిగను ప్రజలకు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరి సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరై గర్తపురి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వందలాది ఆలయాల పునరుద్ధరణకు కృషి చేసి భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో విశిష్ట సేవలందించిన రాజమాత అహల్యాబాయి హోల్కర్ సేవలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ సభ్యులు దీవి విష్ణు చైతన్య, కాశీరాజు మనోహర్ వర్మ, వెంకట్, అవినాష్, హైగ్రీవరాజు, సాగర్, సామెలు, టీడీపీ నాయకులు సాయి దిలీప్, సూర్య, అనీల్, జనసేన డివిజన్ అధ్యక్షుడు జెట్టి బాబు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## సింగపూర్ ఓపెన్‌లో స్వర్ణ చరిత్ర సృష్టించిన సాత్విక్ సాయిరాజ్

- అమలాపురం యువకుడి ఘనతపై హర్షం వ్యక్తం చేసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**విజయవాడ/ అమలాపురం (జర్నలిస్ట్ ఫైల్ ):** కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ స్టార్ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ మరోసారి భారత క్రీడా చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. సింగపూర్‌లో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పురుషుల డబుల్స్ విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ విజయంతో సింగపూర్ వేదికపై భారత బ్యాడ్మింటన్‌కు అరుదైన గౌరవాన్ని తీసుకువచ్చారు.

ప్రపంచ స్థాయి ఆటగాళ్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో సాత్విక్ సాయిరాజ్ తన భాగస్వామితో కలిసి అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించారు. వేగవంతమైన స్మాష్‌లు, అద్భుత సమన్వయం, వ్యూహాత్మక ఆటతో ప్రత్యర్థులను నిలువరించి ఫైనల్‌లో విజయం సాధించారు. ఈ స్వర్ణ పతకం భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచింది.

అమలాపురం వంటి ప్రాంతం నుంచి ఎదిగి ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అగ్రస్థానానికి చేరుకున్న సాత్విక్ సాయిరాజ్ యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆయన సాధించిన ఈ ఘనతపై కోనసీమ జిల్లా ప్రజలు, క్రీడాభిమానులు, బ్యాడ్మింటన్ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు విజేతలను హృదయపూర్వకంగా అభినందించారు. అమలాపురం యువకుడు సాత్విక్ సాయిరాజ్ అంతర్జాతీయ వేదికపై స్వర్ణ పతకం సాధించడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ప్రపంచ స్థాయిలో విజయాలు సాధిస్తున్న సాత్విక్ సాయిరాజ్ భారత యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో పాల్గొని భారతదేశానికి మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని, ఒలింపిక్స్ సహా ప్రధాన క్రీడా వేదికలపై కూడా దేశ జెండాను రెపరెపలాడించాలని రాజ్య సభ సభ్యులు సానా సతీష్ బాబు ఆకాంక్షించారు. సాత్విక్ సాయిరాజ్ విజయంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా బ్యాడ్మింటన్ క్రీడకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

- విద్యా హక్కు చట్టంలో సవరణకు ఏపీటీఎఫ్ డిమాండ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) తప్పనిసరి అంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో, విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ)లోని సంబంధిత నిబంధనలను సవరించి ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి డిమాండ్ చేశారు.

ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23(2)ను ఆధారంగా చేసుకుని సుప్రీంకోర్టు ఇన్‌సర్వీస్ టీచర్లకు కూడా టెట్ అర్హత తప్పనిసరి అని స్పష్టం చేసిందన్నారు. ఈ తీర్పుపై వివిధ సంఘాలు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్లను కూడా సుప్రీంకోర్టు తిరస్కరించిందని పేర్కొన్నారు.

సెక్షన్ 23లో "టీచర్" అనే పదాన్ని ఉపయోగించినప్పటికీ, అది భవిష్యత్తులో నియమితులయ్యే ఉపాధ్యాయులకే వర్తిస్తుందా లేదా ఇప్పటికే సేవల్లో ఉన్న ఉపాధ్యాయులకూ వర్తిస్తుందా అనే అంశాన్ని స్పష్టంగా పేర్కొనకపోవడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని వారు అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలో ఏపీటీఎఫ్ తరపున కూడా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ, అన్ని పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. అందువల్ల ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23(2)ను సవరించాలని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు.

ఇప్పటికే ఎన్నో సంవత్సరాలుగా విద్యా సేవలు అందిస్తున్న ఇన్‌సర్వీస్ టీచర్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని, వారికి టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా చట్ట సవరణ చేపట్టాలని ఏపీటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## స్పెషల్ బ్రాంచ్ అధికారులకు ఘన సన్మానం

- బదిలీలు, పదోన్నతి, పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు జిల్లా పోలీసు శాఖ స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు ఆదివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచనల మేరకు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఏ1 కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన అభినందన సభలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బదిలీ అయిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు చి. రాంబాబు, వై. శ్రీహరిలను ఈ సందర్భంగా సత్కరించి వారి భవిష్యత్ బాధ్యతల్లో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అదేవిధంగా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఎస్‌ఐగా పనిచేస్తున్న వి. శ్రీనివాసమూర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపిక అందజేశారు. అలాగే అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన షేక్ అన్వర్ భాషాను ఘనంగా సత్కరించారు. పోలీసు శాఖలో సుమారు 41 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన ఆయన క్రమశిక్షణ, విధి నిర్వహణలో నిబద్ధత, సహోద్యోగులతో కలసి పనిచేసిన తీరు ఆదర్శప్రాయమని అధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణలు ఉద్యోగ జీవితంలో సహజ ప్రక్రియలేనని, అయితే సేవా కాలంలో చూపిన అంకితభావం, ప్రజాసేవ పట్ల నిబద్ధతే అధికారులకు నిజమైన గుర్తింపునిస్తుందని పేర్కొన్నారు. సత్కారం పొందిన అధికారులు తమ తమ బాధ్యతల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని అభినందించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ విభాగానికి చెందిన అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దేశానికి ఆదర్శం

- "థాంక్యూ సీఎం -- థాంక్యూ లోకేష్" కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**కాకినాడ/విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** మహిళా సాధికారతకు మరింత బలమైన పునాది వేస్తూ తెలుగుదేశం పార్టీ ప్రకటించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ నిర్ణయం దేశ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఇంకా అమలులోకి రాకపోయినా, టీడీపీ మహానాడు వేదికగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించడం దేశానికి ఆదర్శప్రాయమని ఆయన పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన కార్యాలయంలో "థాంక్యూ సీఎం – థాంక్యూ లోకేష్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర పావని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ నిర్ణయాన్ని స్వాగతించారు.

ఈ సందర్భంగా సానా సతీష్ బాబు మాట్లాడుతూ, మహిళలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం ద్వారా మహిళలకు నాయకత్వ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని, రాజకీయాల్లో వారి భాగస్వామ్యం మరింత పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి అనంతలక్ష్మి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వనమాడి సుష్మిత, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పెరబత్తుల రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ తదితరులు వెనుక వరుసలో కూర్చొని మహిళల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని వీక్షించడం విశేషంగా నిలిచింది. అదేవిధంగా ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, నాయకులు నిమ్మకాయల రంగనాగ్, కటకం శెట్టి బాబి, పెంకె శ్రీనివాస్ బాబా, ఏటుకూరి నాగమణి, సీతామహాలక్ష్మి, రామలక్ష్మి తదితరులు హాజరై మహిళా రిజర్వేషన్ నిర్ణయానికి మద్దతు తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆత్మీయ విందులో మహిళలు పాల్గొని ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. మహిళా సాధికారత దిశగా టీడీపీ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతగా "థాంక్యూ సీఎం – థాంక్యూ లోకేష్" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467